ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 17-05- 2026 | సంపుటి: 17, సంచిక: 44, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## దేశాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా

# తీర్చిదిద్దుతాం

**పునరుత్పాదక ఇంధన వినియోగంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం**

**అంతర్జాతీయ ఆర్థిక వృద్ధికి చోదక శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దుతాం: ప్రధాని మోదీ**

**నెదర్లాండ్ పర్యటనలో భాగంగా ప్రవాస భారతీయులతో సమావేశం**



ది హేగ్, మే 16: 'భవిష్యత్తులో ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలని భారత్ ఆకాంక్షిస్తున్నది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా దేశాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుస్తాం. పర్యావరణ పరిరక్షణకు ప్రాధా న్యం ఇస్తూ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతాం. మున్ముందు దేశాన్ని అంత ర్జాతీయ ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే చోదక శక్తిగా ఎదిగేందుకు బాటలు వేస్తాం' అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. నెదర్లాండ్ పర్యటనలో భాగంగా శనివారం ఆయన ఆ దేశ రాజధాని ది హేగ్ నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగిస్తూ భారత్ నిర్దేశించుకున్న నాలుగు ప్రతిష్ఠాత్మక లక్ష్యాల (యాస్పిరేషన్స్)ను విశదీకరించారు. నెదర్లాండ్ వంటి దేశాలతో భారత్ క్రీడా సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నదని వివరించారు. రక్షణ, మొబైల్ ఫోన్లు, సెమికండక్టర్ చిప్స్ వంటి తయారీ రంగంలో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుపుతామని ప్రతినబూ నారు. దేశాన్ని గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సౌర విద్యుత్ వంటి ప్రత్యామ్నాయ వనరులను వినియోగిస్తామని స్పష్టం చేశారు. కరోనా సంక్షోభం, అంతర్జాతీయ యుద్ధాల సమయంలోనూ భారత ఆర్థి క వ్యవస్థ తట్టుకుని నిలబడిందని, మున్ముందు దేశం అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే ప్రధాన చోదక శక్తిగా అవతరిస్తుందని ఆకాంక్షించారు. భారత యువతకు అపారమైన నైపుణ్యాలు, సామర్థ్యాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని దేశం వేగంగా అభివృద్ధి చెందు తున్నదని తెలిపారు. దేశ యువత ఆకాశాన్ని తాకేంత పెద్ద కలలు కంటున్నదని కొనియాడారు.

తరువాయి 2వ పేజీలో...



## జస్టిస్ చంద్రయ్య

# కన్నుమూత

**తెలంగాణ మానవహక్కుల కమిషన్ తొలి చైర్మన్‌గా సేవలు**

హైదరాబాద్, మే 16 (ప్రజాకలం) : తెలంగాణ మానవ హక్కుల కమిషన్ తొలి చైర్మన్, ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. చంద్రయ్య(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో కొద్దిరోజులుగా బాధపడుతున్న ఆయన జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. జస్టిస్ చంద్రయ్య మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. జస్టిస్ చంద్రయ్య భౌతికకాయాన్ని సుప్రీం కోర్టు విశ్రాంత జస్టిస్ సయ్యద్ షా మహమ్మద్ ఖాద్రీ,

తరువాయి 2వ పేజీలో...

## రెండోవిడత ఇందిరమ్మఇళ్లకు

# నిబంధనలు సడలిస్తాం

**ఓఆర్ఆర్ లోపల కనిష్ఠంగా ఎకరం 15 లక్షలు**

**అభివృద్ధి ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ సవరణ..**

**నియోపోలీస్ వద్ద మార్కెట్ విలువ 160 కోట్లు**

**విలేకరులతో ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, మే 16 (ప్రజాకలం) : రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి, క్రయవిక్రయాల ఆధారంగా భూముల విలువను సవరించనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఎకరానికి రిజిస్ట్రేషన్ కార్డు విలువ కనిష్ఠంగా రూ. 15 లక్షలు ఉంటుందని చెప్పారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. నియోపోలీస్ ప్రాంతంలో బహిరంగ వేలంలో ఎకరం రూ. 160 కోట్ల వరకు పలుకుతుండగా.. రిజిస్ట్రేషన్ కార్డు విలువ రూ. 2.10 కోట్లు మాత్రమే ఉ ందని చెప్పారు. ఇలాంటి చోట్ల శాస్త్రీయంగా భూముల విలువ వందశాతం పెంపు ఉంటుందని తెలిపారు. కొన్ని చోట్ల పెంపు.. కొన్ని చోట్ల తగ్గింపు ఉంటుందని వెల్లడించారు. సర్కిళ్లు, జోన్ల అభివృద్ధి ఆధారంగా శాస్త్రీయంగా భూముల విలువ నిర్ణయిస్తామని తెలిపారు. వంద శాతం సీలింగ్ నిర్ణయించినందు.. ఆయా ప్రాంతాల్లో గరిష్ఠంగా ఎకరానికి రూ. 4.20 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని వివరించారు. 2022లో మూడునాలుగు నెలల వ్యవధిలోనే రెండుసార్లు భూముల విలువ పెంచారని.. అప్పుడు పర్సంటేజీ ఆధారంగా



పెంచడం వల్ల కొన్నిప్రాంతాల్లో హెచ్చుతగ్గులు అశాస్త్రీయంగా ఉన్నాయని అన్నారు. వాటిని ఇప్పుడు సరిదిద్దుతామని తెలిపారు. కనిష్ఠంగా 5 శాతం నుంచి గరిష్ఠంగా ఆయా ప్రాంతాల లావాదేవీల ఆధారంగా విలువ పెంపు ఉంటుందని పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




## కాళేశ్వరంలో మే 21 నుండి

# సరస్వతి అంత్య పుష్కరాలు

**- మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

భూపాలపల్లి, మే 16 ప్రజాకలం ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు సరస్వతి నది అంత్య పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఈ పుష్కరాలకు సుమారు 30 నుండి 40 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...





## రాజారాంపల్లి గ్రామంలో

# కాంగ్రెస్ పార్టీ అభినందన సభ

3లో

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్న మంత్రి**

# పాక్ జాగ్రత్త!

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాకిస్థాన్ ఉనికే ప్రశ్నార్థకమన్న భారత ఆర్మీ చీఫ్

**ప్రపంచ పటంలో ఉండాలా.. చరిత్రలో కలిసిపోవాలా మీరే తేల్చుకోండి**

**మరోసారి కవ్వింపు చర్యలు జరిగితే దూకుడుగా ముందుకెళ్తామని స్పష్టం**

**ఆపరేషన్ సింధూర్ సమయంలో చూపిన సంయమనాన్ని ఇక ఆశించవద్దన్న ద్వివేది**

**పహల్గాం మారణహోమానికి ప్రతీకారంగా పాక్‌లోకి చొచ్చుకెళ్లిన భారత సైన్యం**

**ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేసిన ఆపరేషన్ సింధూర్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసలు**



న్యూఢిల్లీ, మే 16: పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. భారత్‌పై ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ ద్వంద్వ వైఖరి కొనసాగిస్తే పాకిస్థాన్ ఉనికే ప్రమాదంలో పడుతుందని ఘాటుగా వ్యాఖ్యానించారు. "ప్రపంచ పటంలో ఒక దేశంగా కొనసాగాలా.. లేక చరిత్ర పుస్తకాలలో మాత్రమే మిగలాలా అనేది పాకిస్థాన్ స్వయంగా నిర్ణయించుకోవాలి" అంటూ సంచలన హెచ్చరికలు చేశారు. శనివారం ఢిల్లీలోని మానేక్‌షా సెంటర్‌లో నిర్వహించిన "సేన సంవాద్" కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ ద్వివేది, భారత సైన్యం భవిష్యత్ వ్యూహాలపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గత ఏడాది నిర్వహించిన "ఆపరేషన్ సింధూర్" తరహా పరిస్థితులు మళ్లీ తలెత్తితే భారత్ ఎలా స్పందిస్తుందనే ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన కఠిన వ్యాఖ్యలు చేశారు. "ఇప్పటివరకు భారత్ సంయమనంతో వ్యవహరించింది. కానీ దాన్ని బలహీనతగా భావిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు.

తరువాయి 2వ పేజీలో...



# చేనేత చరిత్ర

**కేన్స్ రెడ్ కార్పెట్‌పై పోచంపల్లి ఇక్కత్ చేనేత**

**తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచానికి తీసుకెళ్లిన రష్మీ ఠాకూర్**

**నేతన్నల శ్రమకు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు**

**భారత జౌళి మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు**

2




# దిశ సమీక్ష

**- సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచన**

2

# మంత్రి రాజీనామా డిమాండ్

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలన్న కవిత విజ్ఞప్తి

**కుమారుడిపై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో రాజకీయ చర్చ**

**విచారణలో పారదర్శకత కోసం పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్**

**ప్రధాని మోడీకి అధికారిక లేఖ రాసినట్లు ప్రకటన**

**రాజకీయ జోక్యం లేకుండా స్వతంత్ర దర్యాప్తు అవసరమని సూచన**

**మైనర్ల రక్షణ, న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై ప్రాధాన్యత ఉద్ఘాటన**



హైదరాబాద్, మే 16 (ప్రజాకలం) : హైదరాబాద్‌లో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసేలా, తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రధాని నరేంద్ర మోడీకి రాసిన లేఖలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను మంత్రి పదవి నుంచి తక్షణమే తొలగించాలంటూ లేఖలో పేర్కొన్నారు. ఆయన కుమారుడిపై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో ఈ లేఖ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. లేఖలో కవిత పేర్కొన్న ప్రకారం, పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు అత్యంత సున్నితమైనదిగా ఉండటంతో, దర్యాప్తు పూర్తిగా స్వతంత్రంగా, పారదర్శకంగా

తరువాయి 2వ పేజీలో...

# వివాదంపై క్లారిటీ

## వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన

**నకిలీ డిగ్రీలపై చేసిన వ్యాఖ్యల వివరణ**

**యువతపై గర్వం వ్యక్తం చేసిన జస్టిస్**

**పరాన్నజీవుల పోలికపై స్పష్టత**

**మీడియా తప్పుడు**

**అర్థం చేసుకుందని ఆరోపణ**



2

# దేశాన్ని గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి...

వాటిని సాకారం చేసేందుకు భారత ప్రభుత్వం వారికి సహాయ సహకారాలు అందిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలోనే భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్‌గా అవతరించిందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద శక్తిగా ఎదుగుతున్నదని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 12 సెమికండక్టర్ ప్లాంట్ల పనులు సాగుతున్నాయని, వాటిలో రెండు ప్లాంట్లలో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభమైందని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మౌలిక వసతుల కల్పనలో భారత్ దూసుకుపోతున్నదని తెలిపారు. దేశంలో నిర్మిస్తున్న సోలార్ పార్కులు ప్రపంచంలోనే అతిపెద్దవని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో బ్రెజిల్‌ను దాటి భారత్ ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరుకుందని గుర్తుచేశారు. 2036లో భారత్ ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే కోరుకుంటున్నదని వివరించారు. ఈ లక్ష్యంతోనే నెదర్లాండ్స్‌తో తమ దేశం క్రీడా సంబంధాలను బలోపేతం చేసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే రెండు దేశాల మధ్య క్రికెట్, హాకీ రంగాల్లో సత్సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. మోదీ అనంతరం నెదర్లాండ్స్ రాజు విల్లెమ్–అలెగ్జాండర్, రాణి మాక్సిమాతో భేటీ అయ్యారు.

**మోదీకి ఘన స్వాగతం**

నెదర్లాండ్ రాజధాని ది హేగ్ నగరంలో అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి భారత ప్రధాని మోదీ చేరుకున్న తర్వాత ఆయనకు భారతీయులు కరతాళ ధ్వనుల మధ్య ఘనస్వాగతం పలికారు. అంతకుముందు విమానాశ్రయంలో మోదీకి నెదర్లాండ్ విదేశాంగ మంత్రి టామ్ బెరెండ్సెన్, డచ్ సైనిక దళాల అడ్జటెంట్ జనరల్ రియర్ అడ్మిరల్ లుడ్గర్ బ్రూమ్‌లార్, నెదర్లాండ్‌లో భారత రాయబారి కుమార్‌తుహిన్ సాదరంగా ఆహ్వానించారు. మోదీ నెదర్లాండ్స్ పర్యటన ఈనెల 17 వరకు కొనసాగనుంది. 2017లో మోదీ మొదటిసారి ఆ దేశంలో పర్యటించారు. ఇది మోదీ రెండో నెదర్లాండ్ పర్యటన కావడం విశేషం.

# రెండోవిడత ఇందిరమ్మఇళ్లకు నిబంధనలు సడలిస్తాం

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని భూముల విలువను నిర్ణయిస్తామని తెలిపారు. నగరాల్లో ఉండే పాత భవనాల రిజిస్ట్రేషన్ల విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వాలనే అంశంపై ఒకటిరెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. భూముల విలువ పెంపుపై తుది నిర్ణయం తీసుకున్న తరువాత ప్రాంతాలవారీగా ఎక్కడ పెరిగింది.. ఎక్కడ తగ్గింది.. పెంచడానికి, తగ్గించడానికి గల కారణాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

**అటవీ, రెవెన్యూ హద్దులను తేలుస్తాం**

ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు అనేక జిల్లాలో అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలున్నాయని.. రైతులు సాగు చేసుకునే సమయంలో అటవీ అధికారులు వెళ్లి ఇబ్బందులు పెడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నందున.. సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. భూముల సర్వే కోసం ఇప్పటికే 400 రోవర్లు కొనుగోలు చేశామని, జూన్‌లో మరో 420 రోవర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. డీఎఫ్‌వో, కలెక్టర్, అదనపు కలెక్టర్‌ల నేతృత్వంలో అటవీ భూముల హద్దులపై సర్వే చేయిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు, రెవెన్యూ శాఖ మధ్య ఉన్న కేసులపైనా దృష్టిసారించినట్లు వెల్లడించారు. పాల్వంచలో సుమారు 1,000 ఎకరాల్లో ఇదే సమస్య ఉందని తెలిపారు. ఆ భూముల్లో 60 శాతం ఇళ్లు ఉన్నాయని చెప్పారు. సాదాబైనామాపై వచ్చిన ప్రతి దరఖాస్తుకు నోటీసులు ఇచ్చారని.. దీనిపై సీసీఎల్‌ఏ త్వరలో మార్గదర్శకాలు ఇస్తారని వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిబంధనల సడలింపు**

ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతను జూన్ 2న ఆదిలాబాద్ జిల్లా నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. రెండో విడత కింద ఇళ్ల మంజూరు నిబంధనల్లో కొన్ని సడలింపులు ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు పొంది ఉన్నా, ఇప్పటికే ఇళ్లను నిర్మించుకునేందుకు పునాదులు తీసి ఉన్నా, గోడలు, స్లాబ్, ఇల్లు పూర్తయ్యే దశలో ఉన్నవారితో పాటు పెంకులు, నాపరాళ్లు, రేకుల ఇళ్లు ఉన్నవారిలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై)కు అనుసంధానించినా గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు రూ.72 వేల సాయం ఇంకా అందలేదని తెలిపారు. కేంద్రం నిధులు ఇచ్చినా.. ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే.. ఆ సాయాన్ని కూడా భరిస్తుందని స్పష్టంచేశారు. కేంద్ర నిధుల కోసమే ఇళ్ల నిర్మాణం పూర్తయినవారికి ఇచ్చే రాష్ట్ర వాటాను నిలిపివేసినట్లు తెలిపారు.

# కాళేశ్వరంలో మే 21 నుండి సరస్వతి అంత్య పుష్కరాలు

మొదటి పేజీ తరువాయి...

శనివారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఈ పుష్కరాల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మే 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు కాంచీ కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పవిత్ర పుష్కర స్నానంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదే రోజు రాష్ట్ర గవర్నర్ కూడా పవిత్ర స్నానమాచరిస్తారని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఇటీవల విజయవంతంగా ముగిసిన మేడారం జాతర స్ఫూర్తితో ఈ అంత్య పుష్కరాలను నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు పాల్గొని పుణ్యస్నానాలు చేస్తారని, ఉదయం వేళల్లో హోమాలు, సాయంత్రం వేళల్లో భక్తులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, ప్రోటోకాల్ విషయాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, 2012 పుష్కరాలకు 2 లక్షల మంది మాత్రమే వచ్చారని, కానీ గత ఏడాది జరిగిన ఆది పుష్కరాలకు 40 లక్షల మంది వచ్చారని గుర్తుచేశారు. ఈసారి కూడా భారీగా వచ్చే భక్తుల కోసం తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. పోలీసు శాఖ పటిష్టమైన భద్రత, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు సీసీ కెమెరాలు, వాచ్ టవర్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్. ముకుందరెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పంచాయతి రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాక్ జాగ్రత్త!

మొదటి పేజీ తరువాయి...

ఇకపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద దాడులు జరిగితే భారత సైన్యం ఒక్క అడుగు కాదు.. అవసరమైతే అనేక అడుగులు ముందుకేసి నిర్ణయాత్మక దాడులు చేస్తుంది" అని హెచ్చరించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్ చూపించిన ఓర్పు, సహనం మళ్లీ కనిపించకపోవచ్చని స్పష్టం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో 2025 ఏప్రిల్ 22న జరిగిన దారుణ ఉగ్రదాడిని గుర్తు చేస్తూ జనరల్ ద్వివేది ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి అందాలు చూడటానికి వెళ్లిన అమాయక పర్యాటకులపై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టనబెట్టుకున్నారని పేర్కొన్నారు. ఆ ఘటన దేశాన్ని కలచివేసిందని అన్నారు. పహల్గాం మారణహోమానికి ప్రతీకారంగానే భారత్ "ఆపరేషన్ సింధూర్" చేపట్టిందని వెల్లడించారు. 2025 మే 10న భారత సైన్యం పాకిస్థాన్ భూభాగం, పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై కచ్చితమైన దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేసిందని చెప్పారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో భారత్ ఇకపై రాజీ పడదని స్పష్టం చేశారు. భారత్ శాంతిని కోరుకుంటుందని, కానీ దేశ భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని ద్వివేది వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఆయుధంగా ఉపయోగిస్తూ భారత్‌ను బెదిరించాలని చూసే శక్తులకు తగిన సమాధానం ఇచ్చే శక్తి భారత సైన్యానికి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత సైన్యం పూర్తి అప్రమత్తంగా ఉందని, దేశ భద్రతకు విఘాతం కలిగించే ప్రతి కుట్రను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# మంత్రి రాజీనామా డిమాండ్

మొదటి పేజీ తరువాయి...

జరగాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడినట్లు లేఖలో వివరించారు. ఈ తరహా కేసుల్లో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేదా ప్రభావం లేకుండా విచారణ కొనసాగితేనే న్యాయం సాధ్యమవుతుందని ఆమె ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బండి సంజయ్ కుమార్ స్థానం కారణంగా దర్యాప్తు ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం ఉందన్న ఆందోళనను కూడా కవిత లేఖలో వ్యక్తం చేసినట్లు చెప్పుకొచ్చారు. సాక్ష్యాల సేకరణ, విచారణ ప్రక్రియ, అలాగే సాక్షుల భద్రత వంటి అంశాలు ఎలాంటి ఒత్తిడిలేకుండా జరగాలంటే ఆయన పదవి నుంచి తప్పుకోవడం అవసరమని ఆమె సూచించినట్లు తెలుస్తోంది. ఈ కేసు బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం కింద నమోదు కావడంతో, ఇది అత్యంత సున్నితమైన న్యాయ వ్యవహారంగా పరిగణించబడుతోంది. ఇలాంటి సందర్భాల్లో బాధితురాలికి న్యాయం జరగడం, అలాగే న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టడం అత్యంత కీలకమని కవిత తన లేఖలో ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నట్లు తెలుస్తోంది.

అదేవిధంగా, దేశంలో మైనర్ల రక్షణ అంశం రాజకీయ ప్రయోజనాల కంటే మిన్నగా ఉండాలని ఆమె స్పష్టం చేసినట్లు సమాచారం.

రాజ్యాంగ నిబద్ధతను, నైతిక విలువలను కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని గుర్తుచేసిన కవిత, విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని కోరినట్లు లేఖలో పేర్కొన్నారని తెలుస్తోంది. ఈ అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తుండగా, కేంద్ర ప్రభుత్వం ఈ లేఖపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కేసు పూర్తిగా న్యాయ ప్రక్రియ పరిధిలో ఉన్నందున, తదుపరి పరిణామాలు కీలకంగా మారనున్నాయి.

# చేనేత చరిత్ర



## కేన్స్ రెడ్ కార్పెట్‌పై పోచంపల్లి ఇక్కత్ చేనేత

**తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచానికి తీసుకెళ్లిన రష్మీ ఠాకూర్**

**నేతన్నల శ్రమకు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు**

**భారత జౌళి మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు**

హైదరాబాద్, మే 16 (ప్రజాకలం) :

మగ్గం నుండి రెడ్ కార్పెట్ మెట్ల వరకు, తెలంగాణ నుండి ప్రపంచ ప్రఖ్యాత ఫిల్మ్ వేదిక వరకు, పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు దక్కిన అరుదైన సందర్భం ఇది. మిస్ ఆసియా ఇంటర్నేషనల్, భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్, 200 ఏళ్ల తెలంగాణ చేనేత వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లడం గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు. 2026 మే 17 నుండి 21 వరకు జరగనున్న 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం తనకు లభించిన గొప్ప అదృష్టమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలోని పోచంపల్లి ఇక్కత్ చేనేత మొదటిసారిగా కేన్స్ వంటి ప్రతిష్టాత్మక రెడ్ కార్పెట్‌పై ప్రదర్శించబడటం చారిత్రక ఘట్టమని ఆమె తెలిపారు. "ఇది నా ఒక్కదాని గర్వం కాదు. పోచంపల్లిలో మగ్గం ముందు కూర్చొని శ్రమించిన ప్రతి నేతన్న, నేతక్క గర్వం. మన దారం ఇప్పుడు ప్రపంచ దారంగా మారింది" అని ఆమె భావోద్వేగంగా అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన భారత ప్రభుత్వానికి, జౌళి మంత్రిత్వ శాఖకు, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయానికి, అలాగే వీవర్స్ సర్వీస్ సెంటర్, హైదరాబాద్‌కు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (పిపిసిఎల్ వీవ్స్), పోచంపల్లి టై అండ్ డై సంస్థలు మరియు అక్కడి నేతన్నల పాత్రను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత రంగ ప్రతినిధులు, ఎల్బీనగర్ పద్మశాలి సంఘం, చేనేత ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పరిణామం తెలంగాణ చేనేత రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చే మైలురాయిగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# జస్టిస్ చంద్రయ్య కన్నుమూత

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సందర్శించి నివాళి అర్పించారు. జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ పుల్లా కార్తిక్, విశ్రాంత జస్టిస్ రాధారాణి సహా పలువురు న్యాయమూర్తులు జస్టిస్ చంద్రయ్యకు నివాళులర్పించారు. అలాగే, అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్, దళిత, బహుజన సంఘాలు సంతాపం తెలిపాయి. కాగా, జస్టిస్ చంద్రయ్య అంత్యక్రియలు జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో ఆదివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నామని ఆయన కుమారుడు ప్రశాంత్, కుమార్తె లావణ్య తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జిన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబంలో జన్మించిన చంద్రయ్య.. ఉస్మానియా న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం అభ్యసించారు. రాజనీతి శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. ప్రభుత్వ ప్లీడర్‌గా రెండు పర్యాయాలు సేవలందించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడిగా, వివిధ ప్రభుత్వ శాఖలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా ప్రభుత్వం తరపున పలు కేసుల్లో వాదనలు వినిపించారు.

# వివాదంపై క్లారిటీ

**వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన**

**నకిలీ డిగ్రీలపై చేసిన వ్యాఖ్యల వివరణ**

**యువతపై గర్వం వ్యక్తం చేసిన జస్టిస్**

**పరాన్నజీవుల పోలికపై స్పష్టత**

**మీడియా తప్పుడు అర్థం చేసుకుందని ఆరోపణ**



న్యూఢిల్లీ, మే 16 :

తన వ్యాఖ్యలను కొందరు మీడియా వర్గాలు వక్రీకరించాయని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో వృత్తిలోకి ప్రవేశించే వ్యక్తులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన స్పష్టం చేశారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలనే ఆధారంగా తీసుకుని అవాస్తవ కథనాలు ప్రచారం చేయడం సరైనది కాదని ఆయన అన్నారు. తాను వ్యాఖ్యానించినది సమాజంలో వివిధ రంగాల్లోకి చొరబడుతున్న నకిలీ అర్హతలున్న వ్యక్తులపై మాత్రమేనని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. మీడియా, సోషల్ మీడియా సహా పలు రంగాల్లో ఇలాంటి వ్యక్తులు ప్రవేశించడం సమాజానికి హానికరమని మాత్రమే తాను వ్యాఖ్యానించినట్టు ఆయన వివరించారు. అంతేకానీ సాధారణ ప్రజలను లేదా యువతను లక్ష్యంగా చేసుకొని తాను ఎప్పుడూ వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. ఇక 'పరాన్నజీవులు', 'బొద్దింకలు' వంటి పదాల వినియోగంపై వచ్చిన వివాదానికి కూడా ఆయన స్పందించారు. ఆ వ్యాఖ్యలు ప్రత్యేక సందర్భంలో, నకిలీ డిగ్రీలతో వ్యవస్థలోకి వచ్చే కొందరిని ఉద్దేశించి చేసినవేనని ఆయన వివరించారు. వాటిని వక్రీకరించి మొత్తం వర్గాలపై వ్యాఖ్యలుగా చూపడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. భారత యువతపై తాను ఎప్పుడూ గర్వపడతానని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. యువతను దేశ అభివృద్ధికి మూలస్తంభాలుగా తాను చూస్తానని, వారి పట్ల తనకు ఉన్న గౌరవం ఎప్పటికీ తగ్గదని ఆయన తెలిపారు. యువతను విమర్శించానని ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని ఆయన తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో మీడియా ఒక వర్గం తన వ్యాఖ్యలను తప్పుగా ప్రసారం చేయడం వల్ల అనవసర వివాదం తలెత్తిందని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. వాస్తవాలను పరిశీలించి మాత్రమే వార్తలను ప్రచురించాలని ఆయన సూచించినట్లు సమాచారం.

# దిశ సమీక్ష




**సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచన**

**గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశం**

**అంగన్వాడీల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు**

**విద్య, వైద్యం, రోడ్లు, నీటి సరఫరాపై సమీక్ష**

**బ్యాంకు రుణాల పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశాలు**

**అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలని హితవు**

రంగారెడ్డి జిల్లా, మే 16 :

రంగారెడ్డి డిస్ట్రిక్ట్ కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృత సమీక్ష జరిగింది. సమావేశానికి చేవెళ్ల పార్లమెంటు సభ్యులు, దిశా ఛైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, పంచాయతీరాజ్, శిశు సంక్షేమం, పౌర సరఫరాలు, పరిశ్రమలు, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, ఉద్యానవన, మిషన్ భగీరథ, రహదారులు, గృహ నిర్మాణం, అటవీ, ఇరిగేషన్ తదితర శాఖల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి గ్రామానికి చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో అవగాహన సభలు నిర్వహించి ప్రజలకు పథకాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అంగన్వాడీల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు పోషకాహారం క్రమం తప్పకుండా అందించాలని, గుడ్డు, పాలు సరఫరా పద్ధతిని మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాల్యవివాహాల నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన హితవు పలికారు. విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన, అక్రమ మైనింగ్ నిరోధం, మత్స్యకారులకు శిక్షణ, వలల పంపిణీ ద్వారా జీవనోపాధి పెంపు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని గృహాల వివరాలను సమర్పించాలని ఎంపీ ఆదేశించారు. అలాగే బ్యాంకు రుణాల విషయంలో లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాలకు సులభంగా రుణాలు అందించాలని బ్యాంకర్లను హెచ్చరించారు. ముద్ర, విశ్వకర్మ వంటి పథకాల ద్వారా చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి రంగాలకు తక్షణ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. అసంపూర్తిగా ఉన్న ప్రధాన, అంతర్గత రహదారులను త్వరగా పూర్తి చేయాలని, చిన్న మరమ్మతులు కూడా ఆలస్యం కాకుండా చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో పాడి ఉత్పత్తి పెంపుపై చర్యలు తీసుకోవాలని, పశు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా గోపాలమిత్ర వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, కసిరెడ్డి నారాయణరెడ్డి తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కృత్రిమ మేధస్సుతో ఆర్థిక వ్యవస్థ పురోగతి : ప్రిన్సిపాల్




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 16 (ప్రజాకలం)

కృత్రిమ మేధస్సుతో ఆర్థిక వ్యవస్థ పురోగతిని సాధిస్తుందని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే.వేంకయ్య అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల వేడుకల సందర్భంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రోజున కృత్రిమ మేధస్సు పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు ద్వారా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిని సాధిస్తుందని, మూలధనం సహాయంతో యంత్రాలను ఉపయోగించడం వల్ల అధిక ఉత్పత్తిని సాధించడం జరుగుతుందని ఆయన స్పష్టం వ్యక్తం.ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కో – ఆర్డినేటర్ బిల్ల రాజేందర్,దోస్తు కో– ఆర్డినేటర్ ఏ.మనోజ్ కుమార్, లెక్చరర్లు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ మనుమయ విద్యార్థులకు పురస్కారాలు




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 16 (ప్రజాకలం)

మనుమయ విశ్వకర్మ సామాజిక వర్గానికి చెందిన పదవ తరగతి, ఇంటర్, ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శనివారం ప్రతిభ పురస్కారాలు అందచేశారు. అనంతరం సంఘ అధ్యక్షులు మనుమయ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కొండ మురళి మాట్లాడుతూ పది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకం అందుస్తున్నట్లు తెలిపారు. మనుమయ విద్యార్థుల్లో ఉత్సాహం పెంచి ఇంకా ఉన్నత స్థాయిలో వెళ్లేందుకు ఈ సన్మాన కార్యక్రమం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు మ్యాడారపు మురళి, మ్యాడారపు అశోక్, ఇంద్రాల ఈశ్వర్, మద్దెనపల్లి స్వామి, గడిపెల్లి కృష్ణ, మట్టెల గంగాధర్, రామకృష్ణ ప్రభుత్వ ఉపాధ్యాయులు పాలోజి మహేశ్, బొమ్మన చిన్నయ్య, తంగళ్ళపల్లి నవీన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం

### - కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
### - ఎమ్మెల్యే చే సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 16 (ప్రజాకలం)



నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనేదే ప్రభుత్వాల లక్ష్యమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మెట్ పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెట్ పల్లి పట్టణ, మెట్ పల్లి, ఇబ్రహీంపట్న, మల్లాపూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మొత్తం 6,36,000 విలువగల 41 సీఎంఆర్ఎఫ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ఉన్నప్పటికీ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందువల్ల లభించకపోవడంతో నిరుపేదలకు సైతం కార్పోరేట్ వైద్యం అందించాలని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని వెల్లడించారు. నిరుపేదలు కూడా ఈ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిల్లో వైద్య చికిత్సలు చేయించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతైన వరి పంట

మల్లాపూర్ మే 16 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండలం కొత్త ధాం రాజ్ పల్లి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలాల్లో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి ఎకరం మేర వరి పంట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతులు గదసంధ జగదీష్, నేదురి రాములు కు చెందిన పొలాల్లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.పొలాల వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీప రైతులు, అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే గాలి వేగంగా వీయడంతో మంటలు విస్తరించి వరి పంటను పూర్తిగా కాలి బూడిద చేశాయి. పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో రైతులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఏడాది పాటు కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే కాలిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనతో సుమారు లక్ష రూపాయల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని అని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



# డిమాండ్ల పరిష్కారానికి మే 20న మందుల దుకాణాలు బంద్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 16(ప్రజాకలం) డిమాండ్ల పరిష్కారానికి మే 20న మందుల దుకాణాలు బంద్ బంద్ పాటిస్తున్నట్లు మెట్ పల్లి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజంగి సుదర్శన్ తెలిపారు. మెట్ పల్లి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు గాజంగి సుదర్శన్ ఆధ్వర్యంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు శనివారం మెట్పల్లి ఆర్డీవోకు ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ 20 మే 2026న ప్రతిపాదించిన ఒకరోజు దేశవ్యాప్త బంద్ గురించి ముందస్తు సమాచారం, తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ జిల్లా యూనిట్‌గా, పంపిణీదారులను ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ సంస్థ ఔషధ వాణిజ్యం, ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేసే అనేక కీలక సమస్యలు ఇంకా పరిష్కారంకాలేదన్నారు. ఈ పరిస్థితి ఇప్పుడు అత్యంత ఆందోళనకర స్థాయికి చేరి,12.40 లక్షలకుపైగా కెమిస్టులు, సుమారు 4 నుండి 5 కోట్ల ఆధారితుల జీవనోపాధికి



ముప్పుగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో 2026 మే 20వ తేదీన దేశవ్యాప్తంగా ఔషధ వాణిజ్య బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నిరసనగా ఒకరోజు బంద్ చేయడం జరుగుతుందని మా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మెట్పల్లి మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, బండారి విజయకృష్ణ, కోశాధికారి చిలివేరీ శ్రీనివాస్,ఉపాధ్యక్షులు గోవర్ధన్, లక్ష్మణ్, నాగరాజ్ చిరంజీవి, గంగాధర్, హరీష్, రవి, ప్రమోద్, కాసెట్టి శ్రీనివాస్, రఘురాం అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## డిజిపి సివి ఆనంద్ కు శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 16 (ప్రజా కలం) తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను శనివారంనాడు హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ కు పుష్పగుచ్ఛంను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ నూతన బాధ్యతల్లో డిజిపి విజయవంతం కావాలని, అయన నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత పటిష్టం కావాలని శేర్ నర్సారెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణను జీరో క్రైం రేట్ స్టేట్ గా మార్చే లక్ష్యంతో నూతన డిజిపి సివి ఆనంద్ కృషి చేస్తారనే ఆశాభావాన్ని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి వ్యక్తం చేశారు.




## రాజారాంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభినందన సభ

### - ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
### - కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్న మంత్రి



ఎండపల్లి, మే 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కొత్త పాత తేడా లేకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా ఎన్నికైన గెల్లు చంద్రశేఖర్ యాదవ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేశం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లా డుతూ కొత్తగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు మండలం లోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకోని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మండలం లో పార్టీ బలోపేతానికి పనిచేయాలని మంత్రి సూచించారు. గతం లో పనిచేసిన నాయకులతో పాటు కార్యకర్తలను విస్మరించకుండా పార్టీ నియమాలను లోబడి పనిచేస్తు వచ్చే ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమం లో వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్చార్జి చైర్మన్ గోల్ల తిరుపతి, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్, కందికట్ల అమృత–రాజేష్, సర్పంచులు జీరెడ్డి మహేందర్ రెడ్డి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నట్లు ఎండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేశం తెలిపారు.

## అమ్మ చారిటబుల్ ట్రస్ట్‌కు బాడీ ఫ్రీజర్ వితరణ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మీ 16 (ప్రజా కలం) ఇబ్రహీంపట్నం మండలం భర్తీపూర్ గ్రామానికి చెందిన మోహన్ యోగి తండ్రి సొంతి సాయిరాం జ్ఞాపకార్థంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్‌కు శనివారం బాడీ ఫ్రీజర్‌ను అందించారు. మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అమావాస్య సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కర్నల దేవస్థానం (బర్దిపూర్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టుకు ప్రిజర్ అందచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మోహన్ యోగిని శాలువాతో సన్మానించారు. అనంతరం అయన మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యుల సేవా భావాన్ని కొనియాడుతూ, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు మరింత కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవీన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మీ పిల్లలను చేర్పించాలి

### -జిల్లా విద్యాధికారి శారద

పెద్దపల్లి,మే16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య భోదించడం జరుగుతుంది అని పెద్దపల్లి జిల్లా విద్యాధికారి శారద అన్నారు. పెద్దపల్లి పట్టణం లోని బాలుర ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశంలో పాల్గొన్నరు. ఈ సందర్బంగా డిఈవో శారదా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వం విద్యా శాఖలో పెను మార్పులు తీసుకు రానుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృశ్య ప్రభుత్వ పాఠశాల్లోనే మీ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరంశిక్షణ పొందిన విద్యార్థులకు పాటిస్పెషన్ సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అకాడమీక్ మానటరింగ్ అధికారి పి ఎం షేక్,మండల విద్యాధికారి టి.సురేందర్ కుమార్,టీ ఫైబర్ సంస్థ మేనేజర్ శ్రీరామ్ రాహుల్,సిఆర్పిలు బాలసాని వెంకటేశం, సుందరగిరి శ్రీనివాస్,కుంబాల సుధాకర్,యూసుఫ్,టి –ఫైబర్ సంస్థ సిబ్బంది, తల్లిదండ్రులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి







పెద్దపల్లి,మే16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు,ఎన్నికల నమోదు అధికారులు,సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం,మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను సమన్వయం చేసుకుని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక చర్యలు,శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కాలంలో బీఎల్‌వోలు,ఎన్నికల సిబ్బందికి ఎస్ఐఆర్‌పై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధివిధానాలు,ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన,పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని,ప్రతి అర్హ ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు,కొత్త క్లెయిమ్‌లు,దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని,ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు,క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు,వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగించాలని,ఎన్నికల ప్రక్రియలో పూర్తిస్థాయి నిష్పాక్షికత పాటించాలని తెలిపారు. అన్ని పార్టీలకు సమాన దూరంలో ఉండటమే కాకుండా, అది స్పష్టంగా కనిపించేలా అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ,వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు మిస్ అయ్యాయనే వార్తలు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య,మంథని తహసిల్దార్ ఆరిఫోద్దీన్,సంబంధిత శాఖల అధికారులు , తదితరులు,పాల్గొన్నారు.

## ధాన్యం..మక్కల కొనుగోళ్లలో జాప్యం వద్దు

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,మే16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో ధాన్యం,మక్కల కొనుగోళ్లు,లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జూలపల్లి మండలంలోని వడ్కాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని,జూలపల్లి మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాలను,అలాగే ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న వరి ధాన్యం,మక్కల కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు పరిస్థితులను,నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద మక్కల లోడింగ్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని సూచించారు. రవాణా పరంగా వాహనాల కొరత సమస్య తలెత్తకుండా చూడాలని,లారీల లభ్యత తక్కువగా ఉన్నచో ప్రత్యామ్నాయంగా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను ఉపయోగించుకొని మక్కల రవాణా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ధర్మారం మార్కెట్ యార్డును పరిశీలించిన కలెక్టర్ కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు,రవాణా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మ పోచాలు, జూలపల్లి తహశీల్దార్ దత్తు ప్రసాద్,వివిధ శాఖల అధికారులు తదితరులు,జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

ప్రజా కలం

ఆదివారం, మే 17, 2026

# ఎన్నాళ్లీ లీకులు...

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతంలో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీ కి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు.నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్దీ అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేది ఈ పరీక్ష రాసిన విద్యార్థుల గుండెల్లో దిగి న బాకు మాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటి ది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకు పరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు. అవి గుండెలమీద పడే బరువులా అనిపిస్తాయి.పాపం, పుణ్యం తెలియకుండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకు వస్తుందని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతు న్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించారు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు.మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశ యం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భ యం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు. పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్‌ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం.ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం.కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు.నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చదివిన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్‌లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు.అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అ నే ప్రశ్నలు ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవుతుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు.నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటే జ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడు చాలామంది విద్యా ర్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి కాదు, ప్రశ్నకు సరైన సమాధానం గుర్తుపెట్టుకోవడానికి మాత్రమే చదువుతున్నారు. పాఠశా లలు విద్య నేర్పే స్థలాలుగా కాకుండా, పరీక్షలకు సిద్ధం చేసే గదులుగా మారిపోతున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి. కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ విద్యార్థుల ఆశలను మాత్రమే కాదు, వారి భయాలను కూడా వ్యాపారంగా మార్చేసిందిఉదయం నుంచి రాత్రి వరకు టెస్టులు, ర్యాంకులు, పోలికలు, ఒత్తిళ్లు... ఇవన్నీ కలిసి విద్యా బాల్యాన్ని మెల్లగా మింగేస్తున్నాయి. డాక్టర్ కావాలనే కల ఇప్పుడు చాలామందికి సేవాభావం కంటే జతకుపోరాటంగా మారిపో యింది. ఈ వ్యవస్థలో పిల్లలు చదువుకుంటు టూ పెరగడం లేదు. కేవలం ఒత్తిడి మధ్య పెద్దవాళ్లు అవుతున్నారు. నీట్ గురించి మాట్లాడేటప్పుడు మనం మార్కులు, ర్యాంకులు, సీట్ల గురించి ఎక్కువగా మాట్లాడతాం. కానీ, విద్యార్థుల మాన సిక ఆరోగ్యం గురించి చాలా తక్కువగా చర్చిస్తాం. ఒక విద్యార్థి సంవత్సరాల కష్టం ఒక్క పరీక్షపై ఆధారపడినప్పుడు, అతని మనసులో భయం కలగడం సహజం. 'ఫలితం రాకపోతే నా విలువ ఏమిటి?' అనే ప్ర శ్న చాలామంది పిల్లల్ని కుంగదీస్తోంది. బ యటికి కనిపించేది చదువు మాత్రమే.కానీ వారి తమ మనస్సులో ఒంటరితనం, ఆందోళన, నిరాశతో కూడిన యుద్ధం చేస్తున్నారు. పరీక్ష రద్దు వార్త వచ్చిన క్షణంలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేసి ఉండొచ్చు. కొందరు ఏడ్చి ఉండొచ్చు. కానీ, ఇంకా ప్రమాదకరమైన స్పందన మరొకటి ఉంది. అది నిశ్శబ్దం. ఎందుకంటే చాలామంది పిల్ల లు ఇప్పుడు అలసిపోయారు; కేవలం చదువుతో కాదు, నిరంతర ఒత్తిడితో. ఇప్పుడు చేయాల్సింది మళ్లీ పరీక్ష నిర్వహించడం మాత్రమే కాదు. ముందుగా విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి నిర్మించాలి. తప్పు ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విచారణలు పారదర్శకంగా జరగాలి. ఎందుకంటే రహస్యంగా జరిగే విచారణలు అనుమానాలను మరింత పెంచుతాయి. పరీక్ష నిర్వహ ణ వ్యవస్థను సాంకేతికంగా మరింత భద్రం గా మార్చాలి. ప్రశ్నాపత్రం రవాణా నుంచి పర్యవేక్షణ వరకు ప్రతి దశలో డిజిటల్ ట్రాకింగ్ ఉ ండాలి.అంతకంటే ముఖ్యంగా, ఒకే పరీక్షతో జీవితాన్ని నిర్ణయించే విధానం గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభం కావాలి. స్కూల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలా? బహుళ దశల మూల్యాంకనం అవసరమా? రాష్ట్ర విద్యావ్యవస్థల పాత్ర పెరగాలా? అనే ప్రశ్నలపైనా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.విద్యార్థులకు ప్రత్యేక మద్దతు, స్థానిక భాషల్లో నాణ్యమైన వనరులు అందుబాటులోకి రావాలి.

# నేడు పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం



## - జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి

పెద్దపల్లి,మే16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి ఆర్ఆర్ గార్డెన్‌లో నేడు నిర్వహించనున్న పెద్దపల్లి జిల్లా పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సన్మాన కార్యక్రమాన్ని పద్మశాలి కుల బాంధవులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామమూర్తి పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్,తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దూడం వెంకటరమణ, పద్మశాలి సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్,పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకట్ల రాజకుమార్ మరియు ఇతర రాష్ట్ర నేతలు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో పద్మశాలి సంఘం ఎదుర్కొంటున్న పలు సమస్యలను అతిథులకు వివరిస్తూనే, నూతనంగా ఎన్నిక కాబడిన మున్సిపల్ చైర్మన్లు,కౌన్సిలర్లు,సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ మెంబర్స్ గా ఎన్నికైన వారందరికీ ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.కావున జిల్లాలోని అన్ని మండలాలు,పట్టణాలు, గ్రామాల నుండి పద్మశాలి సంఘం కులస్తులు మరియు ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్య, సాయిరి మహేందర్,గుండా మురళి,సామల హరికృష్ణ,మేరుగు యాదగిరి,బత్తుల రమేష్,అడిచర్ల స్వతంత్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు

పెద్దపల్లి,మే16:(ప్రజాకలం జిల్లాప్రతినిది)

రైతులు ఎలాంటి అధైర్యానికి లోనుకావద్దని,ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు భరోసా ఇచ్చారు.పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రస్తుతం రైతు రాజ్యం నడుస్తోందని ఆయన స్పష్టం చేశారు.జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం,మక్కల కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను పరిశీలించి,వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.?అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత పాలకుల పదేళ్ల కాలంలో కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో రైతులు నిలువు దోపిడీకి గురై ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు.కానీ నేడు పెద్దపల్లి నియోజకవర్గంలో ఒక్క కిలో కూడా తరుగు లేకుండా పారదర్శకంగా ధాన్యం సేకరిస్తున్నామని,వడ్ల కటింగ్ లేని నియోజకవర్గంగా పెద్దపల్లి నిలిచిందని గర్వంగా ప్రకటించారు.క్షేత్రస్థాయిలో రైతులకు జరుగుతున్న ఈ మేలును తట్టుకోలేకనే ప్రతిపక్షాలు రాజకీయ కుట్రలతో లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని,వారి అబద్ధపు ప్రచారాలను రైతులు నమ్మవద్దని పిలుపునిచ్చారు.?ఈ వేసవి సీజన్‌లో జిల్లాలో దాదాపు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చినట్లు సివిల్ సప్లై అధికారులు అంచనా వేశారని,మే 25 నాటికి 3.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం,జిల్లా కలెక్టర్,అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.ప్రస్తుతం నియోజకవర్గంలో 60 శాతం



కొనుగోళ్లు పూర్తయ్యాయని,మిగిలిన 40 శాతాన్ని మరో 15 రోజుల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు.తీవ్రమైన ఎండ తీవ్రత,హమాలీల కొరత కారణంగా మిల్లుల్లో ధాన్యం దిగుమతికి కొంత సమయం పడుతోందని,రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు నియోజకవర్గంలో 11 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను వేగవంతం చేశామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,400 మద్దతు ధర కల్పిస్తోందని చెప్పారు.ఒకవేళ రైతులు అత్యవసరంగా సొంతంగా గన్నీ సంచులు కొనుగోలు చేస్తే, ప్రభుత్వం ఒక్కో సంచికి రూ.21 చొప్పున సెంటర్ ఇంచార్జ్ నిర్వహణ ఖాతా ద్వారా రైతులకు తిరిగి చెల్లిస్తుందని స్పష్టం చేశారు.ప్రస్తుతం వేసవి ఎండలతో పాటు అనుకోకుండా వర్షాలు వచ్చే ముప్పు ఉన్నందున,రైతులు కొనుగోలు కేంద్రాల్లో తమ పంట తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్,మార్కెట్ కమిటీ చైర్మన్,మున్సిపల్ చైర్మన్,స్థానిక కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# రైతుల ముసుగులో భూ ఆక్రమణలు

## - ధర్మారం మండలంలో 48 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ధర్మారం, మే 16 : ( ప్రజా కలం )

ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నెం 273 లో ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలు, చట్టవిరుద్ధ రికార్డు నమోదుల పై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకు న్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. సర్వే నెం 273 లో మొత్తం 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉ ండగా అందులో దాదాపు 59 ఎకరాలు కాస్తులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు అందులో సుమారు 48 ఎకరాల భూమిని 23 మంది రైతులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకుని మొఖాపై సాగు చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు.ఈ నేప థ్యం లో భూ ఆక్రమణ చట్టం 1905 ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంత రం రికార్డులను సమగ్రంగా పరిశీలించి వారు పొందిన పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారించినట్లు తెలిపారు తద నంతరం తహశీల్దార్, ధర్మారం ఆధ్వర్యం లో సుమారు 48 ఎకరాల ప్రభుత్వ భూమిని గట్లు చదును చేసి ప్రభుత్వ ఆధీనం లోకి తీసుకున్నట్లు వెల్లడించారు ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్ట రీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉ న్నా చట్టవిరుద్ధంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకు ని ఉన్నా స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభు త్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు లేనిపక్షం లో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం తో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు.

# పట్టణ, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం

## - ప్రకటించిన డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్య

జగిత్యాల్ ప్రతినిధి మే 16 (ప్రజాకలం) జగిత్యాల జిల్లాలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల నియామకాలు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తెలిపారు. ధర్మపురి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా చిలుముల లక్ష్మణ్ కాసారపు బాల గౌడ్, బుగ్గారం మండల అధ్యక్ష కార్యదర్శులు గా నగునూరి నర్స గౌడ్, బత్తుల తిరుపతి, ఎండపల్లి అధ్యక్ష, కార్యదర్శులుగా గెళ్ళు శేఖర్, రాజేశం, గొల్లపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రాపల్లి గంగన్న, జల్లి అనిల్ యాదవ్, పెగడపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు గా కడారి తిరుపతి, చాట్ల భాస్కర్ లను నియమించినట్లు తెలిపారు. అలాగే కోరుట్ల అధ్యక్షులుగా పన్నాల అంజయ్య, మల్లాపూర్ అధ్యక్షులుగా మాటొల్ల సమ్మయ్య, ఇబ్రహీంపట్నం అధ్యక్షులుగా గూడ శ్రీకాంత్, మెట్‌పల్లి అధ్యక్షులుగా జంగిటి రాజేందర్, కోరుట్ల పట్టణ అధ్యక్షులుగా తిరుమల గంగాధర్, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షులుగా మహమ్మద్ రైసొద్దీన్ లను నియమించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.



# వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన మండల కాంగ్రెస్ నాయకులు



వెల్గటూర్, మే 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోళ్ల తిరుపతి శనివారం రోజున సందర్శించారు. ఈ సందర్భంగా వారు శిబిరం లో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను, వసతులను పరిశీ లించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి వేసవి శిబిరాల్లో పాల్గొని తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యా ర్థులకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని సమ యాన్ని వృథా చేయకుండా ఇక్కడ నేర్పించే అంశాలను నేర్చుకోవాలని కోరారు. శిబిర నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. అనంత రం క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు గంధ్ర ప్రతాప్ రావు, మాజీ సర్పంచ్ మేరుగు మురళీ గౌడ్, కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ సెక్రెటరీ శ్రీకాంత్ రావు, బిసి సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, వార్డ్ సభ్యులు గుండాటి సందీప్ రెడ్డి, నక్క సురేష్, స్థానిక నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్, రేకుంట నర్సయ్య, బొడ్డు సంతోష్, గుమ్ముల అజయ్, దుంపటి సత్యం, మూగల రమేష్, మన్నే జితేందర్, నేరెళ్ళ బుచ్చయ్య, గుమ్మడి శ్రీహరి, ఆశా వర్కర్లు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటుపై హర్షం

## - తెలంగాణ ఉద్యమ కారులు ముడితనపెల్లి ప్రభాకర్

మల్హర్, మే16 ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడంపై మల్హర్ రావు మండల తెలంగాణ ఉద్యమకారుడు టియుఎఫ్ ఫోరం భూపాలపల్లి జిల్లా ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు చొరవ చూపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్‌గా



నియమితులైన కమిటీ చైర్మన్ కె. కేశవరావు, సభ్యులు పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కమిటీతో క్షేత్రస్థాయి ఉద్యమకారులకు త్వరలోనే పూర్తి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉ ద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో గత 9 ఏళ్లుగా చేసిన నిరంతర పోరాటాలు, అనేక వినతుల ఫలితంగానే ఈ కమిటీ ఏర్పాటైందని, అందుకు ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శని జయంతి వేడుకల్లో పాల్గొన్న కొండేటి శ్రీధర్

## - భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

## - మహంకాళి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచన



(వర్ధన్నపేట /హాసన్ పర్తి) మే 16 ప్రజాకలం ప్రతినిది: వర్ధన్నపేట నియోజకవర్గంలోని హాసన్పర్తి భక్త మార్కండేయ దేవాలయంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన శని జయంతి ప్రత్యేక పూజ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు శ్రీ కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి దేవుడి ఆశీస్సులు పొందారు.అనంతరం అక్కడ జరుగుతున్న మహంకాళి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ఆలయ నిర్మాణ వివరాలనునిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు కేంద్రంగా నిలిచే ఈ ఆలయ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, కందకట్ల కుమారస్వామి, రవీంద్రాచారి, దాసరి రాజు, హరీష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శ

రేణిగుంట : శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.తిమ్మయ్యగుంటలో నివాళిముందుగా రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ పరిధిలోని తిమ్మయ్యగుంట గ్రామానికి వెళ్లిన సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరెడ్డి కోడలు దివంగత గాయత్రి రెడ్డి కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. గాయత్రి రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన, మాధవరెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. సుధాకర్ రెడ్డి కుటుంబానికి ధైర్యంఅనంతరం ఏర్పేడు మండలం, చిన్న అంజిమేడు గ్రామంలో దివంగత చిత్తానూరు సుధాకర్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి మరణం తీరని లోటని పేర్కొంటూ, పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# అత్యంత వైభవంగా కూసుమంచి లో విరాట్ హిందూ సమ్మేళనం

## కూసుమంచి లో ఘనంగా 'విరాట్ హిందూ సమ్మేళనం'

## భారీ సంఖ్యలో పాల్గొన్న హిందూ బంధువులు

పాలేరు మే 16(ప్రజా కలం న్యూస్ ) : కూసుమంచి మండల కేంద్రంలో నిర్వహించిన "విరాట్ హిందూ సమ్మేళనం" కార్యక్రమం గ్రామ మాజీ సర్పంచ్ చెన్న మోహన్ రావు, అధ్యక్షతన అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనానికి మండల పరిసర ప్రాంతాల నుండి హిందూ బంధువులు, భక్తులు, యువత భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముందు స్థానిక రామాలయం నుండి గ్రామంలో జై శ్రీ రామ్ జై జై శ్రీ రామ్ అంటూ భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు.




ఈ ఆధ్యాత్మిక సమ్మేళనంలో ముఖ్య అతిథిలు గా ఆర్ ఎస్ ఎస్ విభాగ్ కార్యదర్శి చేపూరి రామ్ చంద్రరావు , సుందరకాండ శ్రీనివాస్ రావు , మరియు వెంకట ప్రతాప్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ. సమాజంలో సనాతన ధర్మ రక్షణ, హిందూ సమాజ ఐక్యత, నైతిక విలువల పెంపొందింపునకు ఇటువంటి సమ్మేళనాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ, రాబోయే తరాలకు వాటి విశిష్టతను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కూసుమంచి మండలం ఆధ్యాత్మిక శోభతో సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక హిందూ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కళలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

## సోఫీనగర్ గురుకులంలో ఘనంగా విద్యా వారోత్సవాలు

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు

నిర్మల్ మే16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. శనివారం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళలు, హస్తకళలు, సాంస్కృతిక ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యతో పాటు కళలు, సాంస్కృతిక రంగాల్లో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ కొత్త విషయాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ రాజు, ఎంఈఓ పద్మ, పాఠశాల ప్రిన్సిపల్ డానియల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలు చేస్తున్న ముగ్గురు అరెస్ట్

## - బంగారం, వెండి ఆభరణాలు, నగదు, బైక్ స్వాధీనం

## - మరో మూడు చోరీ కేసులు వెలుగులోకి

## - ప్రెస్ మీట్ లో వెల్లడించిన పోలీసు అధికారులు

షాద్‌నగర్, మే 16:(ప్రజా కలం):ప్రతినిధి

షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్లు మరియు చోరీకి ఉపయోగించిన హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షాద్‌నగర్ +ని= కాలనీకి చెందిన కుక్కలి సురేష్ తన భార్య అనారోగ్యంతో 7వ తేదీన ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లగా, 9వ తేదీన తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు, బెడ్‌రూమ్ బీరువాల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. దీనిపై షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు రోహిత్ కుమార్, శివమ్ సింగ్, సాగర్ కుమార్ రవిదాస్ అనే ముగ్గురు నిందితులను 16వ తేదీన అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులు మేడ్చల్ ప్రాంతంలో చోరీ చేసిన హోండా షైన్ బైక్‌పై షాద్‌నగర్‌కు వచ్చి +ని= కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని చోరీ చేసినట్లు వెల్లడించారు. చోరీ చేసిన కొంత బంగారం, వెండి వస్తువులను షాద్‌నగర్ =ఐజ బస్ స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తికి రూ.40 వేలకి విక్రయించి వచ్చిన డబ్బును ముగ్గురు పంచుకున్నట్లు తెలిపారు. మిగిలిన వస్తువులను తరువాత అమ్మాలని దాచిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇదే కాకుండా షాద్‌నగర్ పరిధిలోని ఫార్చున్ కాలనీ, జూఖ రోడ్ న్యూ రాఘవేంద్ర కాలనీ ప్రాంతాల్లో మరియు మేడ్చల్ పరిధిలో మరో చోట కూడా చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు వెల్లడించారు.

నిందితుల వద్ద నుంచి రూ.20 వేల నగదు, హోండా షైన్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, వెండి కాళ్ల కడియాలు, వెండి పట్టగొలుసులు, బంగారు చెవి కమ్మలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, షాద్‌నగర్ ఐజూ సిహెచ్ శిరీష, ాజూ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ కె.సీతారాం పర్యవేక్షణలో ఐూ× శివరెడ్డి ఆధ్వర్యంలో క్రైమ్ టీమ్ ఈ కేసును ఛేదించింది. కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు

# జీఓ విడుదలపై హర్షాతిరేకాలు

## - సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పెద్దపల్లి,మే16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ విడుదల చేయడం పట్ల జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ జిల్లా కేంద్రంలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చిత్రపటానికి ఉద్యమకారులు పాలాభిషేకం చేసి,అనంతరం స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో కష్టనష్టాలను,ఇబ్బందులను భరించిన ఉద్యమకారుల సేవలను, త్యాగాలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి జీఓ విడుదల చేయడం అభినందనీయమని,ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,స్థానిక ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,ఎంపీ గడ్డం వంశీకృష్ణల నాయకత్వంలో పెద్దపల్లి ప్రాంతంలోని నిజమైన ఉద్యమకారులందరికీ ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన మిగిలిన హామీలను కూడా త్వరితగతిన అమలు చేసి, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సంబరాల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ముఖ్య నాయకులు దబ్బేటి చంద్రకళ, కందుల సదాశివ,ముల్ల మల్లేష్,అశోక్ పటేల్, ధనుంజయ,కేశవ రెడ్డి, ఉప్పల శ్రీనివాస్,మాదాల పోచాలు,మంద భాస్కర్ యాదవ్, ఎన్. రామస్వామి,కాల్వల తిరుపతి,తుమ్మల నంబరావు,రౌతు సందీప్,రూపా ఠాకూర్ సింగ్,లలిత ఠాకూర్ సింగ్,ప్రేమలత,చాట్ ఇనార్సమ్మ,ఎం.డి ఖాదా బేగం,పి. చంటమ్మ, జి.గీత,రామ లక్ష్మమ్మ,నెల్లమ్మ,పద్మ, స్నేహ,మల్లమ్మ,ఎన్.శకుంతల,గడ్డం లక్ష్మి, తుమ్మల జ్యోతిలతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

## -ఉద్యమకారుల కమిటీ ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం

## -హర్షం వ్యక్తం చేసిన మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

(వరంగల్ /వర్ధన్నపేట) మే 16 ప్రజాకలం ప్రతినిది:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన ఉద్యమకారుల సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీపై వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అనేది ఒక్క కుటుంబం కృషి ఫలితం కాదని, శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్ రెడ్డి, పోలీస్ కిష్టయ్య వంటి అమరవీరుల త్యాగాలు, సబ్బండ వర్ణాల పోరాటాలు, సకల జనుల ఉద్యమాల ఫలితమని వెంకటయ్య తెలిపారు. సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఉద్యమకారుల గుర్తింపును తుంగలో తొక్కి, మొత్తం క్రెడిట్‌ను కల్వకుంట్ల కుటుంబానికే దక్కేలా ప్రయత్నించారని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలను మెట్లుగా చేసుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి తీరని అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు గౌరవప్రదమైన గుర్తింపు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు కల్పించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. కమిటీ చైర్మన్‌గా కె. కేశవరావు, సభ్యులుగా పొన్నం ప్రభాకర్ గౌడ్, కోదండరాం రెడ్డి, అద్దంకి దయాకర్, శోభన్ రెడ్డి నియామకం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల కుటుంబాల పట్ల గౌరవాన్ని చాటుకుందని వెంకటయ్య పేర్కొన్నారు. తెలంగాణ కోసం పోరాడింది బహుజన వర్గాలేనని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గౌరవం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, ఐనవోలు టెంపుల్ డైరెక్టర్ భీమా నాయక్, వర్ధన్నపేట 12వ వార్డు కౌన్సిలర్ సిరిపెల్లి వాణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# డెంగ్యూ వ్యాధి ప్రభలకుండా జాగ్రత్తలు పాటించాలి

## - సమాజం భాగస్వామ్యంతోనే వ్యాధి నిర్మూలన సాధ్యం - కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి




(వరంగల్ )మే 16 ప్రజాకలం ప్రతినిది:

డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు, వైద్య సిబ్బంది, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చింతల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ డెంగ్యూ దినోత్సవ నినాదమైన "సమాజంలో అందరూ ఐక్యంగా నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నిర్మూలించడం" లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్సకంటే ముందస్తు నివారణే అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లా మలేరియా విభాగం ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను పరిశీలించిన కలెక్టర్, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఇంటింటి జ్వర సర్వేలు చేపట్టి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డెంగ్యూ బాధితులు పౌష్టికాహారం తీసుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం డెంగ్యూ అదుపులోనే ఉందన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి శ్రీమతి కే. రజిని మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో "డ్రై డే"పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

వరంగల్ మహానగర పాలక సంస్థ వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న డెంగ్యూ నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఇఫ్తికార్ అహమ్మద్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అరుణ్, డాక్టర్ విజయకుమార్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ దిలీప్, డాక్టర్ వేద కిరణ్, డాక్టర్ శ్రవణ్, హెచ్ఈఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

## - బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## - తహశీల్దార్ కు మెమొరాండం అందజేసిన ఎన్ హెచ్ ఆర్ సి సభ్యులు



( వరంగల్/ పర్వతగిరి) మే 16, ప్రజాకలం ప్రతినిధి.

కల్లెడ గ్రామ శివారులో ముంజాలకుంట తండా వద్ద గల మామిడి తోటలో పనిచేయడానికి వచ్చి విద్యుత్ షాక్ కు గురై మరణించిన మైనర్ బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని అందుకు బాధ్యులైన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ పర్వతగిరి మండల ఇన్చార్జి గారె జయరాజ్, జేరిపోతుల వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ పర్వతగిరి మండల కమిటీ తరపున పర్వతగిరి మండల తహశీల్దార్ టి. వెంకటస్వామి కి మెమోరాండం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మైనర్ బాలురులను పనికి తీసుకువచ్చిన సదరు వ్యక్తి పై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అతని నిర్లక్ష్యం వల్లనే బాలుడు మరణించాడని అన్నారు. ఈ సంఘటన పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తూ బాలుడి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. ఇందులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కూడా ఉందని వారు కూడా శాఖ పరంగా బాధ్యత వహించాలని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రమాదకరమైన లైన్ లను గుర్తించి వాటిని తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. మరణించిన బాలుడి కుటుంబానికి నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ప్రమాదకరమైన పనులకు మైనర్లను తీసుకొచ్చే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని ఆర్ యస్ పి డిమాండ్

## -మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్లే ప్రజలపై భారాలు

## -ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్

మే 16 ప్రజాకలం ప్రతినిది:(వరంగల్ /వర్ధన్నపేట)కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, సిఎన్‌జీ ధరలను వెంటనే తగ్గించాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పీ) వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అసమర్థ ఆర్థిక విధానాల ఫలితంగానే ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆయన విమర్శించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో ఆయన మాట్లాడుతూ.. మోడీ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజల జీవన భారం రోజురోజుకు పెరుగుతోందన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఇంధన ధరలను మళ్లీ పెంచడం ప్రజలపై మరింత భారాన్ని మోపినట్లేనని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని




రుణమాఫీల రూపంలో మళ్లిస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు మేలు చేసే విధానాలను విడనాడి, పేదల సంక్షేమం లక్ష్యంగా పాలన కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్ష పార్టీలు, ప్రజాస్వామ్యవాద శక్తులు కలిసి ప్రజలను చైతన్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మోడీ ప్రభుత్వం పెంచిన ఇంధన ధరలను వెనక్కి తీసుకునే వరకు పోరాటాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# అకాల వర్షాలపై రైతులకు తహశీల్దార్ టి. వెంకటస్వామి హెచ్చరిక

( వరంగల్/ పర్వతగిరి ) మే 16, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండల ప్రజలకు, రైతులకు మండల తహశీల్దార్ టి. వెంకటస్వామి ముఖ్య సూచనలు జారీ చేశారు. శనివారం, ఆదివారం మండల పరిధిలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట కొనుగోలు కేంద్రాలు, గోదాములు, పొలాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యాన్ని టార్పాలిన్లు, ప్లాస్టిక్ కవర్లతో తప్పనిసరిగా కప్పి భద్రపరచాలని తెలిపారు. ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు



తీసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే ధాన్యం కొనుగోలు సెంటర్ల ఇన్‌చార్జ్‌లు ధాన్యం రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వర్షపు నీరు లోనికి చేరకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ వెంకటస్వామి ఆదేశించారు. రైతులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

# మే 18న నిర్వహించే మాక్ ఎక్సర్సైజ్‌కు పటిష్ట ప్రణాళిక

## - అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం మే 16(ప్రజా కలం న్యూస్ ) మే 18న ఉదయం 8 గంటల నుండి నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. లివరద ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించాల్సిన తీరుపై జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని, దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్ల పై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించి పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ విపత్తులనిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మున్నేరు వరదలు లేదా ఇతర భారీ వరదలు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరు పై మాక్ ఎక్సర్సైజ్ మే 18న నిర్వహణకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. లిజిల్లాలోని నీటి వనరులపై నిరంతరం నిఘా, భారీ వరదల సమయంలో నీటి విడుదల కోసం ఎగువ, దిగువ ప్రాంతాలతో సమన్వయం, విపత్తుల సమయంలో వెంటనే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, ఆపద మిత్ర వంటి విపత్తు స్పందన బృందాలకు సమాచారం చేరేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలని తెలిపారు. సహాయక శిబిరాలు, ప్రజల తరలింపు, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య లక్ష్యం

- పదే ఏళ్ల పాలనలో రైతులను వేమార్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం
- నేడు బిఆర్ఎస్ సవతి తల్లి ప్రేమ ప్రదర్శన
- జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్

( వరంగల్/ పర్వతగిరి) మే 16, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు మాట్లాడుతూ, రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు అధికారులతో, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ రైతులూ ఎటువంటి ఇబ్బంది పడకుండా చూసుకోవాలని క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పనిచేస్తున్నారని, గత పాలకులు రైతులను, రైతు కూలీలను, కౌలు రైతులను ఏమాత్రం పట్టించుకోలేదని, రైతులను దోచుకుని ప్రశ్నించిన రైతులకు బేడిలేసిన ఘన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని, బిఆర్ఎస్ హయాంలో క్వింటాకు 4 నుండి 6 కిలోల వరకు తాలు, తేమా, తరుగు పేరుతో మిల్లర్లతో కుమ్మక్కై దోచుకున్న బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కాంటాలై వారి అకౌంట్లో డబ్బులు పడతా ఉంటే చూసి ఓరువలేక రైతులను రెచ్చగొడుతున్న నాయకుల్లరా ఖబర్దార్ అని కిసాన్ జిల్లా అధ్యక్షులు దేవేందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ ఏర్పడ్డ తర్వాత రైతు ఎంతో ఆనందంగా, చిరునవ్వుతో ఉన్నారని, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి కార్యక్రమాలు ఎన్నో తీసుకొచ్చి రైతులను రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



పని చేస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని, రైతు పక్షాన ఉండే ప్రభుత్వమని, ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, రైతు సంక్షేమం కోసం దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు వ్యవసాయ పనిముట్లు గాని, వ్యవసాయ విత్తనాలు గాని, సబ్సిడీ పనిముట్లు వచ్చినా కూడా రైతులకు నేరుగా అందించే విధంగా అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని, రైతు పండించిన ప్రతి గింజ కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు రామారావు, రోల్లకల్ సర్పంచ్ దేవి మంగ్యా నాయక్, మాజీ సర్పంచ్ బిలు నాయక్, బీసీ నాయకులు డాక్టర్ ఆడేపు కుమారస్వామి, బూత్ కన్వీనర్ శ్రీనివాస్, వెంకన్న, లింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చీకటి పాలన అంతం అయ్యే వరకు పోరాటం అగదు

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ - రుద్రారం నుంచే మార్పు మొదలైంది

ప్రజాస్వామ్య పోరాట సభలో పుట్ట మధూకర్ పిలుపు




మంథని, మే 16 ప్రజాకలం ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంథని నియోజకవర్గంలో చీకటి పాలన మొదలైందని, ఆ చీకటి పాలనను అంతం చేస్తేనే మళ్లీ వెలుగులు వస్తాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో నియంతపాలన అంతం చేయడానికై నిర్వహించిన "మంథని ప్రజాస్వామ్య పోరాటం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మంథని మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్ట శైలజలతో కలిసి పుట్ట మధూకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తున్న అన్నాదమ్ములు ఇక్కడి ప్రాంతాన్ని అస్సలు అభివృద్ధి చేయట్లేదని మండిపడ్డారు. 40 ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లేసి గెలిపిస్తే.. కనీసం 40 మందికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేకపోయారని ధ్వజమెత్తారు. అభివృద్ధి చేసే పూర్తి అవకాశం మంత్రికి ఉన్నా, ఆయన ఆ దిశగా అస్సలు ఆలోచన చేయడం లేదని విమర్శించారు. కాటారం మండలం రుద్రారం నుంచే ఈ కాంగ్రెస్ అరాచక పాలనకు వ్యతిరేకంగా మార్పు మొదలు కావాలని, 2028లో నియోజక వర్గానికి మళ్లీ వెలుగులు తీసుకువచ్చేలా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. తనకు తల్లిదండ్రులు, జన్మదినం ఉన్నప్పటికీ.. గతంలో స్తోమత లేకనో, తెలియకనో ఎప్పుడూ పుట్టినరోజు చేసుకోలేదని పుట్ట మధూకర్ గుర్తుచేసుకున్నారు. తాను తల్లిదండ్రులను చూడకపోయినా.. ఇక్కడి అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు తనను ఆశీర్వదించి, ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చిన రోజునే తన నిజమైన జన్మదినంగా భావిస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో ఈ చీకటి, నియంత పాలనకు చరమగీతం పలికిన రోజే తన జన్మదినాన్ని ప్రజా జన్మదినంగా జరుపుకోవాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతకుముందు మంథని పట్టణంలోని రాజగృహాలో పుట్ట మధూకర్-శైలజ దంపతులు తమ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిభిరంలో పాల్గొని రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

నిజమైన ఓటరు ఓటు వాక్కు కోల్పోరాదు: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

బీఎల్‌వోలకు సమగ్ర శిక్షణ ఇవ్వాలి - ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి

నిర్మల్ మే16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ అమలు విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో చేపట్టబోయే ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎస్ఐఆర్ నిబంధనలు, విధివిధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఫారాల నిర్వహణ తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. మ్యాపింగ్‌లో



ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పరిశీలనలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్పష్టత కల్పిస్తామని తెలిపారు. ఓటరు ప్రోజెనీ మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలనలు నిర్వహించాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి
- నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి




ఖమ్మం, మే 16( ప్రజా కలం న్యూస్ )

ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను సమన్వయం చేసుకుని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కాలంలో బీఎల్ఓ లు, ఎన్నికల సిబ్బందికి ఎస్ఐఆర్‌పై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఓకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యంచేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, గత వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో మంచి పురోగతి సాధించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన అన్ని సూచనలను అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజల వద్ద నివాస ధ్రువీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని సందర్భాల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన, పట్టు ఉన్న సమర్థులైన బీఎల్‌వోలను నియమించాలని ఆదేశించారు. ఏ ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అత్యంత జాగ్రత్తగా పనిచేయాలని తెలిపారు. అన్ని బీఎల్‌వోలకు పూర్తిస్థాయి శిక్షణ అందించాలని, క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడే సమయంలో ఎవరూ నిర్లక్ష్యంగా లేదా అనవసర వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేశారు. ఏదైనా ఓటరు పేరు జాబితాలో లేకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రధాన అజెండా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడటమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అభ్యంతరం, క్లెయిమ్, దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా డెయిరీ అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి

- నిధులు వృథా కాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలి
- గ్రామ, మండల స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు సమాంతరంగా చేపట్టాలి
- ఉపాధి హామీ ద్వారా మౌలిక సదుపాయాల పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు పొందాలి
- ఇందిరా మహిళా డెయిరీపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, మే 16( ప్రజా కలం న్యూస్ )

ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమం అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రతి శాఖకు కేటాయించిన లబ్ధిదారుల లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ విడుదల అనంతరం అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి సంబంధించి బడ్జెట్ త్వరగా విడుదలయ్యేలా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, మైనారిటీ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. విడుదలైన నిధులు సక్రమంగా వినియోగం అయ్యేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, యూనిట్లు నిర్దేశిత కాల వ్యవధిలో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి అవసరమైన గ్రామ స్థాయి, మండల స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమాంతరంగా చేపట్టాలని, దీనిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు వెంటనే పొందాలని సూచించారు. కొంతమంది లబ్ధిదారులకు అవసరమైన పశువుల షెడ్ల నిర్మాణాలను ఉపాధి హామీ క్రింద పరిగణనలోకి తీసుకుని, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రారంభంగా వినియోగిస్తున్న డీఎంఎఫ్‌టీఈ నిధులను, ఉపాధి హామీ నిధులు మంజూరైన తర్వాత తిరిగి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సభ్యులకు మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలకు సంబంధించి, ఆసక్తి చూపిస్తూ ముందుండి పనులు చేపట్టే లబ్ధిదారులను ఎంపీడీవోలు గుర్తించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభమైన లబ్ధిదారుల కోసం అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. ప్రగతిశీల లబ్ధిదారులకు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్ మొత్తాన్ని అందించి, అనంతరం ఉపాధి హామీ నిధులు వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి జమ చేసే విధానాన్ని పారదర్శకంగా, ఖచ్చితంగా పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. పశువుల షెడ్ల నిర్మాణం పటిష్టంగా, నాణ్యతతో ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు సోలార్ వ్యవస్థ ఏర్పాటును కూడా చేపట్టాలని ఆదేశించారు. రెడ్కో అధికారులతో సమన్వయం చేసుకుని అర్హతలను పరిశీలించాలని సూచించారు. సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు సాధ్యమైన ప్రాంతాలను సాంకేతికంగా పరిశీలించి, అనుకూల ప్రాంతాల్లోనే పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఇందిరా మహిళా డెయిరీ వచ్చే రెండు సంవత్సరాల్లో పూర్తిస్థాయి స్వయం సమృద్ధి సాధిం చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి బీఎంసీ వద్ద బ్రేక్ ఈవెన్ సాధించేందుకు రోజుకు ఎంత లీటర్ల పాలు సేకరించాల్సి ఉంటుందో అంచనా వేసి, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డెయిరీ స్థిరత్వం కోసం ఎంత మేర పాలు సేకరించాలి, సేకరించిన పాలను ఎక్కడ విక్రయించాలి అనే అంశాలపై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను వచ్చే మంగళవారం లోగా సమర్పించాలని ఆదేశించారు. గరిష్టంగా 10 రోజుల ఆపరేషనల్ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి 10 రోజులకు వ్యాపారం ద్వారా నిధులు అందే విధంగా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని తెలిపారు. ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణలో ఆదాయం, వ్యయం, పాల సేకరణ, మార్కెటింగ్, తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణను పకడ్బందీగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ, అధికారులు చొరవతో పనిచేసి కేటాయించిన బడ్జెట్ సమయానికి విడుదలై, సక్రమంగా వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, బిసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి, ఇంచార్జీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి పురంధర్, పంచాయతీ రాజ్ ఈఈ మహేష్, విజయ డెయిరీ డిడి కె.రవి కుమార్, డిఆర్డిఓ ఏపిడి జయశ్రీ, వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్. విజయ్ చంద్ర, ఏపిఎంలు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం పెద్దన్న పవనే...



కాకినాడ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ తన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధిగానే కాకుండా.. తన రాజకీయానికి హ్యూమన్ టచ్ ఇస్తున్నారు. పిఠాపురం మొత్తాన్ని ఆత్మీయ కుటుంబంగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా ప్రతినిధి పాత్రకు భిన్నంగా, ఆయన అక్కడ ఒక కుటుంబానికి పెద్దన్న తరహాలో ప్రతి ఇంటి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా, నియోజకవర్గంలోని పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో భరోసా కల్పిస్తూ, ఒక పెద్దన్న తన కుటుంబం పట్ల చూపే బాధ్యతను ఆయన నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఆయన చూపిస్తున్న శ్రద్ధ అందర్నీ ఆశ్చర్య పరుస్తోంది. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యాభ్యాసం కల్పించడంతో పాటు, తల్లిదండ్రులు లేని చిన్నారులకు భగవంతుని బిడ్డలు అని పేరు పెట్టి తన సొంత జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఒక తండ్రి తన పిల్లల చదువు కోసం ఎలాగైతే తపన పడతారో, పవన్ కళ్యాణ్ గారు కూడా పిఠాపురం విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్నారు. విద్యా సంస్థలను ఒప్పించి ఉచిత అడ్మిషన్లు ఇప్పించడం ద్వారా ఒక తరం భవిష్యత్తును ఆయన తీర్చిదిద్దుతున్నారు.సంక్షేమ పథకాలను కేవలం ప్రభుత్వ ఫైళ్లకు పరిమితం చేయకుండా, పండుగ వచ్చిందంటే పిఠాపురంలోని ప్రతి ఆడబిడ్డకు తన తరఫున చీరలు పంపడం, కష్టాల్లో ఉన్న రైతులకు అండగా నిలవడం ఆయనకు అలవాటుగా మారింది. ఉపాధ్యాయుల సమస్యలైనా, సామాన్యుల ఆరోగ్య అవసరాలైనా పవన్ ఉన్నారు అనే ధీమా ఇప్పుడు నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోంది. క్షే జలు ఆయనను ఒక నాయకుడిలా కంటే, తమ ఇంటి పెద్ద దిక్కులా భావించి కష్టాలు చెప్పుకుంటున్నారు. వాటిని ఆయన పరిష్కరిస్తున్నారు.పిఠాపుం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్ గా మార్చే క్రమంలో పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ఈ వ్యక్తిగత సహాయ ? సామాజిక బాధ్యత ఫార్ములా ఒక సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికింది. నియోజకవర్గవ్యాప్తంగా 580 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తికి అనుగుణంగా నచ్చిన కోర్సుల్లో చేర్పించే బాధ్యతను పవన్ కళ్యాణ్ స్వయంగా చేపట్టారు. వీరిలో రాష్ట్రస్థాయిలో 598 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి కూడా ఉన్నారు.ఇప్పటికే తల్లిదండ్రులు లేని పిల్లలకు తన జీతం నుంచి నెలకు రూ. 5,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న ఆయన, ఇప్పుడు ఈ విద్యా సాయం ద్వారా మరో ముందడుగు వేశారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, విద్యార్థుల కెరీర్ పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ చొరవతో పలు ప్రముఖ విద్యా సంస్థలు ఈ 31 మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. విద్యార్థులు ఏ కాలేజీలో చదవాలనుకుంటున్నారో, ఏ కోర్సుపై వారికి ఆసక్తి ఉందో తెలుసుకొని, సంబంధిత యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి ఈ అవకాశాన్ని కల్పించారు.తన పిలుపును గౌరవించి విద్యార్థులకు బాసటగా నిలిచిన విద్యా సంస్థలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో నాయకులు హామీలు ఇవ్వడం సహజం, కానీ ఇచ్చిన హామీలను దాటి తన వ్యక్తిగత చొరవతో, సొంత జీతంతో ప్రజలకు సాయం చేయడం పవన్ కళ్యాణ్ ప్రత్యేకతను చాటుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో విద్యార్థుల పట్ల ఆయన చూపిస్తున్న ఈ ఆదరణ కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రజాప్రతినిధులకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది. సామాన్య విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుతున్న పవన్ కళ్యాణ్ పిఠాపురం వాసుల మనసు గెల్చుకుంటున్నారు.అభివృద్ధి పనుల కోసం నిధులు తేవడం ఒక ఎత్తు అయితే, తన వ్యక్తిగత ఆదాయాన్ని ప్రజల కోసం ఖర్చు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం మరో ఎత్తు. పిఠాపురం ప్రజల పట్ల ఆయన చూపిస్తున్న ఈ వాత్సల్యం, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ఒక ఆత్మీయ అనుబంధంగా మారుతోంది.

# ఘర్ వాపసీ కష్టాలు

నెల్లూరు : వైసీపీ నుంచి చాలా మంది నేతలు గత రెండేళ్ళుగా బయటకు పోయారు, వివిధ కారణాలతో అనేక మంది పార్టీకి గుడ్ బై కొట్టారు. ఫ్యాన్ నీడన తమకు ఉక్కబోతగా ఉందని చెప్పి మరీ తలాఖ్ అనేశారు. వైసీపీలో ఏళ్ళ తరబడి పనిచేసిన వారు పునాదుల నుంచి ఉన్న వారు వైఎస్సార్ కుటుంబంతో తరాలుగా పనిచేస్తున్న వారు కూడా పార్టీ గేటు దాటారు. ఇదంతా ఒక విధంగా ఆశ్చర్యంగా సాగింది. రాజకీయాల్లో ఇవన్నీ మామూలు అయినా ఏ పార్టీకి అయినా మొదటి నుంచి ఉన్న వారు కొనసాగుతారు. అయారాం గయారాం ల విషయం అందరికీ ఎరుకే. కానీ పునాదుల నుంచి ఉన్న వారే వెళ్ళి పోవడం అంటే అది వైసీపీకి కలవరం కలిగించే అంశమే అని కూడా విశ్లేషణలు ఉన్నాయి.వైసీపీలో జగన్ తరువాత నంబర్ టూ అనిపించుకున్న విజయసాయిరెడ్డి పార్టీని వీడుతారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు, ఆయన పార్టీ నుంచి చాలా సైలెంట్ గా నిష్క్రమించారు. అలాగే వైసీపీతోనే సర్వం అనుకున్న మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, ఆళ్ల నాని, సామినేని ఉదయభాను, జగన్ బంధువు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంటి వారు చాలా సులువుగా బంధాలను తెంపుకుని బయటకు వెళ్ళారు. ఇక మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీల జాబితా చూస్తే చాలానే ఉంది. అంతవరకూ ఎందుకు ఎమ్మెల్సీలుగా ఇంకా చేతిలో అధికారం ఉన్నా కూడా వైసీపీ వద్దు అని పదవులు సైతం వదులుకుని వెళ్ళిన వారూ ఉన్నారు. అయితే వీరంతా వైసీపీ భారీ ఓటమికి సంబంధించిన బాధలోనో లేక కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి సొంత ఇబ్బందుల వల్లనో వెళ్ళారని అంతా అనుకున్నారు. వైసీపీ అధినాయకత్వం కూడా అలాగే భావించి కొన్నాళ్ళకు అయినా వారంతా రిటర్న్ అవుతారు అని ఊహించింది. అయితే ఇతర పార్టీలలో చేరి ఇబ్బందులు పడుతున్నా తాము వైసీపీలోకి తిరిగి వెళ్లేది లేదని చాలా మంది నేతలు బాహాటంగా ప్రకటిస్తున్నారు అంటే వైసీపీ అంటే వారికి ఎంతటి వెగటు పుట్టిందో అర్థం కావడం లేదని అంటున్నారు. తాజాగా ఒంగోలు జిల్లా దిగ్గజ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అయితే తాను ఎట్టి పరిస్థితిల్లోనూ వైసీపీ గడప తొక్కేది లేదని అన్నారు. తన భవిష్యత్తు అంతా జనసేనలోనే అని క్లారిటీ ఇచ్చారు. అయినా తనను టార్గెట్ చేసి తాను వైసీపీలోకి వస్తున్నారు అని ప్రచారం చేయిస్తున్నారు అని మండిపడ్డారు. తాను జనసేనలో ఒక వేళ ఇబ్బంది పడినా వైసీపీకి వచ్చిన నొప్పి ఏంటని బాలినేని ప్రశ్నించారు. వైసీపీ నుంచి వెళ్ళిన మరో కీలక నేత విజయసాయిరెడ్డి వీలైనపుడల్లా వైసీపీని విమర్శిస్తూనే ఉన్నారు. వైసీపీ అధికారంలోకి రావడం కష్టమని ఆయన జోస్యం చెబుతూ వస్తున్నారు. అంతే కాదు వైసీపీకి ఏపీని ఏలా అభివృద్ధి చేయాలో విజన్ లేదని లేటెస్ట్ గా ఆయన హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో టీడీపీకి వైసీపీకి ఆల్టర్నేషన్ గా థర్డ్ ఫోర్స్ రావాలని కూడా ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. ఇదే విషయం పదే పదే చెబుతున్నారు. దాంతో విజయసాయిరెడ్డి ఇదిగో అదిగో వచ్చేస్తున్నారు అని జరుగుతున్న ప్రచారం అంతా ఒట్టిదే అని అంటున్నారు. ఇక ఇదే తీరున అనేక మంది మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారని అంటున్నారు. వీరంతా తమకు ఇతర పార్టీలలో చాన్స్ లేకపోయినా ఓకే కానీ తిరిగి వైసీపీలోకి వెళ్ళమని అంటున్నారు అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు. వైసీపీ ఓటమి తరువాత పార్టీని పటిష్టం చేయాలని చూస్తోంది. చాలా చోట్ల పాత కాపులు లేక ఇబ్బందులు వస్తున్నాయి. దాంతో అనుభవం ఉన్న వారు గతంలో పార్టీలో పనిచేసిన వారు వస్తే ఘర్ వాపసీ కింద ఓకే చెబుతారు అన్న ప్రచారం ఉంది. మరి వైసీపీలోకి వచ్చే నాయకులు ఎవరు అన్నదే చర్చగా ఉంది. చిత్రమేంటి అంటే చాలా మంది ఏ పార్టీలో చేరకుండా వెయిట్ చేస్తున్నారు మరి వీరిలో ఎవరైనా తిరిగి వైసీపీ వైపు వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# ఏపీలో పొదుపు చర్యలు షురూ..

విజయవాడ : పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా స్పందించింది. . ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ప్రతి ఒక్కరూ తమ కాన్వాయ్‌లను తగ్గించుకుని దేశ ఆర్థిక భద్రతే పరమావధిగా అడుగులు వేస్తున్నారు. నేడు జరిగిన కేబినెట్ సమావేశం ఇందుకు వేదికగా నిలిచింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అధికారిక కాన్వాయ్‌ను 50 శాతం మేర కుదించుకున్నారు. గతంలో సుమారు 10కి పైగా వాహనాలతో వెళ్లే ముఖ్యమంత్రి, నేడు కేవలం 4 వాహనాలతోనే సచివాలయానికి చేరుకున్నారు. తన భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండటానికి, వారి కోసం ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేశారుఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తన కాన్వాయ్‌ను 4 వాహనాలకు పరిమితం చేసుకోవాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. జెడ్ కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. మంత్రి నాదెండ్ల మనోహర్ కేవలం 3 వాహనాల కాన్వాయ్‌తో సచివాలయానికి వెళ్లగా, మంత్రులు అచ్చెన్నాయుడు , మరి కొంత మంది వెళ్లి కేవలం ఒక్కో వాహనంలోనే కేబినెట్ భేటీకి హాజరయ్యారు.మంత్రి నారా లోకేశ్ తన కాన్వాయ్‌ను సగానికి కుదించి, కేవలం రెండు వాహనాలకే పరిమితం చేశారు. భద్రతా ప్రోటోకాల్ ప్రకారం రావాల్సిన ఇతర సిబ్బంది కోసం ఆయన కూడా ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఇది భద్రతను నిర్లక్ష్యం చేయకుండానే పొదుపును ఎలా పాటించవచ్చో తెలియజేస్తోంది. అంతేకాకుండా, మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, పయ్యావుల కేశవ్ వంటి వారు ఎస్కార్ట్ వాహనాలు లేకుండా సింగిల్ వాహనాల్లోనే సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.అంతర్జాతీయ పరిస్థితుల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఒత్తిడి పెరుగుతోందని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పెట్రోల్, డీజిల్ పొదుపు చేయాలని పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ స్థాయిలోనే కాకుండా, ప్రజలందరూ ఈ పొదుపు యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు.సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో క్యాబినెట్ భేటీ జరిగింది. దాదాపు పదికి పైగా వాహనాలతో వచ్చే చంద్రబాబు కేవలం నాలుగు వాహనాలకు మాత్రమే పరిమితం అయ్యారు. భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండేందుకు వారికోసం ఒక బస్సు ఏర్పాటు చేశారు. మంత్రి లోకేష్ సైతం తన కాన్వాయ్ ను తగ్గించుకున్నారు. కేవలం రెండు వాహనాలతో వచ్చారు. సీఎం మాదిరిగా తన సెక్యూరిటీ సిబ్బంది కోసం ఒక బస్సు ఏర్పాటు చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ సైతం తన కాన్వాయ్ ని తగ్గించుకున్నారు. జడ్ క్యాటగిరి లో ఉన్న దుబారా తగ్గించేందుకు వీలుగా పవన్ సగానికి పైగా వాహనాలను తగ్గించుకోవడం విశేషం.చివరికి హోం మంత్రి వంగలపూడి అనిత సైతం తన ప్రోటోకాల్ పక్కన పెట్టి మరి తన వాహన శ్రేణిని తగ్గించుకున్నారు. కొందరు మంత్రులు అయితే సింగిల్ వాహనంలో క్యాబినెట్ భేటీకి హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఎనిమిది పొదుపు అంశాలపై ఏపీ ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు నిర్ణయించారు సీఎం చంద్రబాబు. ప్రధాని హైదరాబాద్ పర్యటనలో భాగంగా కీలక సూచనలు ఇవ్వగా ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శలు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఆచరించి..

## అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో రక్తపాతం..

### నరసరావుపేటలో ఘోర హత్య..!

పల్నాడు : కేంద్రం నరసరావుపేటలో అర్ధరాత్రి ఘోర హత్య కలకలం రేపింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది.గత రాత్రి సుమారు 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు, నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# జగన్ మావిగన్ యూ టర్న్

విజయవాడ : ఏపీ రాజకీయాల్లో ఒకప్పుడు మూడు రాజధానుల మంత్రం పఠించిన వైసీపీ హఠాత్తుగా మావిగన్ అనే ఊహాజనిత రాజధానిని ప్రకటించింది. జగన్ రెడ్డి ప్రకటించిన ఆ రాజధాని కాస్తా ఇప్పుడు ఆ పార్టీకి మింగుడు పడని వ్యవహారంగా మారింది. అమరావతికి పోటీగా అత్యంత ఖర్చు తక్కువతో ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయవచ్చని అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించినా, అది క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ పొందకపోగా.. తీవ్ర స్థాయిలో ఎకసెక్కాలకు గురవుతోంది. సోషల్ మీడియాలో వస్తున్న సెటైర్లు, విమర్శలకు సమాధానం చెప్పుకోలేక ఇప్పుడు వైసీపీ శ్రేణులు ఈ అంశంపై వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నాయి.అమరావతిని అవినీతి గనిగా అభివర్ణిస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మావిగన్ మోడల్‌ను తెరపైకి తెచ్చినప్పుడు వైసీపీ నేతలు ఆకాశమే హద్దుగా మాట్లాడారు. కానీ, అది కేవలం ఒక ఊహాజనిత పదంగానే మిగిలిపోయిందని, దానికి ఎలాంటి శాస్త్రీయ పునాది లేదని మేధావుల నుంచి వచ్చిన విమర్శలతో ఆ పార్టీ డిఫెన్స్‌లో పడింది. అసలు మావిగన్ అనే పేరు వినగానే జనాల్లో వస్తున్న నవ్వులు చూశాక, ఈ అంశంపై చర్చ పెడితే పరువు పోవడం ఖాయమని గ్రహించిన నేతలు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రోజా వంటి వారు సైతం ఇప్పుడు ఆ రెండు ప్రాంతాలు ఒక్కటే కదా అంటూ సర్దుబాటు మాటలు మాట్లాడుతుండటం ఆ పార్టీలో నెలకొన్న అయోమయానికి నిదర్శనం.

అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చి, నిధులు కూడా మంజూరు చేస్తున్న తరుణంలో మావిగన్ ప్రస్తావన వైసీపీకి సెల్ఫ్ గోల్‌లా మారింది. ఒకవైపు అమరావతిలో పనులు శరవేగంగా జరుగుతుంటే, కేవలం ప్లాన్-బి అంటూ లేని కారిడార్ గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతుందని ఆ పార్టీకి ఆలస్యంగా జ్ఞానోదయం అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు మేధావులతో చర్చలు లేవు, సోషల్ మీడియాలో పోస్టులు లేవు. కేవలం తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన ఈ మావిగన్ సిద్ధాంతాన్ని జనం మరిచిపోయేలా చేయడమే ఇప్పుడు వైసీపీ ముందున్న ఏకైక మార్గంలా కనిపిస్తోంది.అమరావతిని దెబ్బకొట్టాలని తీసిన మావిగన్ అస్త్రం తిరగబడి సొంత పార్టీకే తగిలింది. రాజకీయంగా మైలేజ్ వస్తుందని ఆశించిన ఈ కాన్సెప్ట్ కాస్తా, ఇప్పుడు కేవలం మీమ్స్‌కు మాత్రమే పరిమితం కావడంతో వైసీపీ నేతలు ఇప్పుడు గన్ తీసి పక్కన పెట్టి, మళ్ళీ పాత సంక్షేమ రాగాన్నే అందుకోవాలని చూస్తున్నారు.

# గ్రేటర్ సిటీలుగా విజయవాడ, తిరుపతి



విజయవాడ : ఏపీలో రెండు నగరాలు గ్రేటర్ సిటీలుగా మారనున్నాయి. విజయవాడ, తిరుపతిలకు గ్రేటర్ హోదా రానుంది. ఈ రెండు నగరాల్లో 138 పంచాయతీల విలీన ప్రతిపాదనల్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నంలో మరో 63 పంచాయతీలను చేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు గ్రామాల విలీనానికి సంబంధించి అంశంపై ఫోకస్ పెట్టారు. త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు..ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రెండు నగరాలను 'గ్రేటర్' హోదాకు మార్చబోతోంది. విజయవాడ, తిరుపతి నగరాల గ్రేటర్ ప్రతిపాదనలకు సంబంధించి మరో అప్డేట్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం రెండు నగరాల విస్తీర్ణం పెంచేందుకు.. 10 మండలాల్లోని 138 గ్రామ పంచాయతీలను విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోకి మరో 64 పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో జనగణన పూర్తయ్యేలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. వాస్తవానికి గ్రేటర్ నగరాల ప్రతిపాదనలపై ఇప్పటికే నిర్ణయం తీసుకోవాల్సింది కానీ జనగణన కారణంగా పక్కన పెట్టారు.విజయవాడ గ్రేటర్ సిటీ ప్రతిపాదనలో భాగంగా ఆ? మండలాల్లో ఉన్న 75 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని 2014-2019 మధ్య ప్రతిపాదనలు వచ్చాయి. కానీ గత ఐదేళ్ల ఈ ప్రతిపాదనల్ని పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రతిపాదనల్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. విజయవాడ గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటైతే కేంద్రం నుంచి నిధులు కూడా వస్తాయి.. అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.. అందుకే ఈ ప్రక్రియన వేగవంతం చేయనున్నారు. విజయవాడలోకి ఇప్పటికే చుట్టుపక్కల ఉన్న ఎన్నో గ్రామాలు, పట్టణాలు కలిసిపోయాయి.. కానీ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల హోదాలోనే ఉన్నాయి. అందుకే అభివృద్ధికి అవకాశం లేకుండా పోయింది. అందుకే విలీన ప్రక్రియను పూర్తిచేసి విజయవాడను గ్రేటర్ కార్పొరేషన్‌గా మార్చాలని భావిస్తున్నారు.తిరుపతిని గ్రేటర్ కార్పొరేషన్‌గా ఏర్పాటు, గ్రామాల విలీనానికి సంబంధించి గతేడాది తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి మండలాల్లోని 64 గ్రామాలను గ్రేటర్ తిరుపతిలోకి విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే మంగళం, అవిలాలలు తిరుపతి నగరంలో కలిసిపోయాయి.. అవి పంచాయతీలుగా ఉండటంతో అభివృద్ధి పనులు నిలిపోయాయి. ప్రతిపాదించిన గ్రామాలతో పాటుగా నగరంలో కలిసిన ప్రాంతాలతో గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. విలీన ప్రక్రియపై త్వరలోనే క్లారిటీ వస్తుంది అంటున్నారు.గ్రేటర్ విశాఖపట్నంలోకి 64 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాలు ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన గ్రామాల్లో 60శాతం నగరంలో కలిసిపోయాయి. అందుకే ఈ పంచాయతీలను గ్రేటర్ పరిధిలోకి తీసుకుంటే మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా గ్రామాల విలీనం చాలా ముఖ్యమని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి, భీమిలి, గాజువాక మున్సిపాలిటీలు గ్రేటర్ విశాఖపట్నంలో విలీనమైన తర్వాతే అభివృద్ధి చెందాయని చెబుతున్నారు. మొత్తం మీద విజయవాడ, తిరుపతి గ్రేటర్ సిటీలుగా మారబోతున్నాయి.. విటు గ్రేటర్ విశాఖపట్నంలో మరికొన్ని గ్రామాలు విలీనంకానున్నాయి

# ఘనంగా జాతీయ టెక్నాలజీ డే

## ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షో

హైదరాబాద్ : హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ) లో జాతీయ టెక్నాలజీ డే వేడుకలతో పాటు ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి హాజరై ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. సీఎస్ఐఆర్-సీఎంఈఆర్ఐ అభివృద్ధి చేసిన ఈ విద్యుత్ ఆధారిత ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ యంత్రాలు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. డీజిల్ ఆధారిత యంత్రాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించిన ఈ పరికరాలు తక్కువ నిర్వహణ ఖర్చు, సులభ వినియోగం, పర్యావరణ హిత పనితీరు వంటి ప్రత్యేకతలను కలిగి ఉన్నాయని వివరించారు. మహిళా రైతులు కూడా సులభంగా వినియోగించుకునేలా ప్రత్యేక డిజైన్తో రూపొందించినట్లు వెల్లడించారు. సుస్థిర వ్యవసాయం, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ రోడ్షో ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఆసక్తి వ్యక్తం చేశారు. రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, విధాన నిర్ణేతలు సహా 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బొత్స స్థానంలో వరుదు..

విజయనగరం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అధినేత జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని బెంగళూరు వచ్చారు. అక్కడి నుంచి తాడేపల్లి కి చేరుకున్నారు. పార్టీ సీనియర్లతో వరుసగా సమావేశాలు జరుపుతారు. వచ్చే నెల నుంచి ఆయన జిల్లాల పర్యటనలు మొదలు పెడతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి ఆయన పర్యటనలు ఉంటాయని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మరోవైపు జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కొత్తగా పార్టీ తరఫున ఒక నియామకం చేపడతారని తెలుస్తోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. 175 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 11చోట్ల మాత్రమే ఆ పార్టీ గెలిచింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. కానీ శాసనమండలిలో మాత్రం 30 మందికి పైగా ఎమ్మెల్సీలు ఆ పార్టీకి ఉన్నారు. అక్కడ మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది తిరుగులేని ఆధిపత్యం. అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఉంది. అందుకే తనకు దక్కని ప్రతిపక్ష హోదా ఒక సీనియర్ కు ఇవ్వాలని భావించారు జగన్మోహన్ రెడ్డి. అలా బొత్స సత్యనారాయణకు చాన్స్ దక్కింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బొత్స చీపురుపల్లి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కానీ విశాఖ స్థానిక సంస్థల నుంచి బొత్సకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి.. శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఛాన్స్ ఇచ్చారు. అలా ఒక సీనియర్ నాయకుడిగా బొత్స సముచిత స్థానాన్ని దక్కించుకున్నారు.అయితే ఇటీవల తరచూ బొత్స అనారోగ్యానికి గురవుతూ వస్తున్నారు. రాజకీయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బొత్సకు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండేందుకు వీలుపడటం లేదు. ఇప్పటికే కుటుంబ సభ్యులతో పాటు పిల్లలిద్దరూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ గా పని చేసేందుకు సిద్ధమయ్యారు. అందుకే బొత్సను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న క్రియాశీలక పదవుల నుంచి విముక్తి కలిగించాలని కుటుంబ సభ్యులు అధినేత జగన్మోహన్ రెడ్డిని కోరారట. ఆయన సానుకూలంగా స్పందించారట. ఒకవేళ బొత్స వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడి పదవి నుంచి వైదొలిగితే తరువాత ఎవరు అనేది మెదులుతున్న ప్రశ్న.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం

ఆల్వాల్: మే 16: ప్రజా కలం ప్రతినిధి

అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం తో నిరుపేదలకు, భక్తులకు భోజన సదుపాయం కల్పించి ఆకలిని తీర్చుతున్నట్లు



అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మహిళా కన్వీనర్ రుక్మిణి ముఖ్య అతిథిగా పాల్గొని అన్న దాన వితరణ కార్యక్రమంను ప్రారంభించారు.సమాజ సేవే పరమ ధర్మమని, సేవా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగం, మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 15 వ నెల అన్నదానం కార్యక్రమం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు నాగేష్, మంచాల రవీందర్, అయిత సత్యం, అమర బాలేష్, గుండా జగదీష్, తడక వెంకటేష్, గుండవల్లి శ్రీనివాస్, తుడుపు నూరి బాలేష్, నీతి రమేష్, పిన్నింటి లక్ష్మీనారాయణ, మంచికొండ నాగేందర్, శంకర్ అంజయ్య, వచ్చి ప్రసాద్, నాగేశ్వర్, ఉప్పల లక్ష్మణ్, చిరుత సత్యనారాయణ, రెడ్డిపల్లి వెంకటేష్, రాజేందర్, మంచాల ప్రభాకర్, కాముని సంతోష్, దాముకొండ శ్రీనివాస్, దాముకొండ రామచందర్, బెల్లిమంచు కోటి నాగేశ్వరరావు, నాగేందర్, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

## ముగ్గురికి జైలు శిక్ష.. 31 మందికి రూ.2.32 లక్షల జరిమానా




గజ్వేల్:16మే2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించగా,మొత్తం 31 మందికి రూ.2,32,000 జరిమానా విధించారు.గజ్వేల్ ట్రాఫిక్ సీఐ డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి గత కొన్ని రోజులుగా పట్టణంలోని పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్,తూప్రాన్ రోడ్,ముట్రాజ్‌పల్లి రోడ్, సంగాపూర్ రోడ్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో 19 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు.బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వారు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు రూ.1,72,000 జరిమానా విధించడంతో పాటు ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 12 మందికి ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.60,000 జరిమానా విధించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ డి. సత్యనారాయణ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ట్రాఫిక్ పోలీసుల సూచనలు

మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

డ్రైవింగ్ లైసెన్స్‌తోనే వాహనాలు నడపాలి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ఉపయోగించాలి.ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను తప్పనిసరిగా పాటించాలి.అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలకు వెంటనే దారి ఇవ్వాలి.మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. "మన భద్రత -- మన చేతుల్లోనే" అనే భావనతో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని పోలీసులు సూచించారు.

# బి ఎం ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరాఠీ కృష్ణమూర్తికి ఘన సన్మానం

## ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, ఆర్టిజన్ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

### - బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు

గజ్వేల్:16 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన మరాఠీ కృష్ణమూర్తిని గజ్వేల్‌లోని వారి నివాసంలో పలువురు నాయకులు కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు మాట్లాడుతూ, ఎలక్ట్రిసిటీ



ఎంప్లాయిస్, ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేయాలి. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో బీఎంఎస్ కీలక పాత్ర పోషిస్తోంది. నూతన రాష్ట్ర కమిటీ కార్మికుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలి" అని అన్నారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.మరాఠీ కృష్ణమూర్తికి కప్పర ప్రసాదరావు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పుంటి శీను,జిల్లా ఉపాధ్యక్షులు బాల కిషన్,భూపతి రాజు, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గుడాల శేఖర్,ప్రధాన కార్యదర్శి ఎల్లంరాజు,రాష్ట్ర నాయకులు సిద్ధల రవి,బైరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 100 శాతం ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యం

## - బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయకుండా చర్యలు
## - దోమలు పెరిగే ప్రాంతాలు గుర్తించి నివారణ కార్యక్రమం
## - ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



మల్కాజిగిరి, మే16(ప్రజా కలం ప్రతినిధి)

సాట్ చెత్త సేకరణ వాహనాల ద్వారా 100 శాతం ఇంటింటికి చెత్త సేకరించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.శనివారం మౌలాలి సంజయ్ గాంధీ నగర్, మల్కాజిగిరి మహేంద్ర హిల్స్,ఇందిరా నెహ్రూ నగర్,ఆనంద్ బాగ్, తుకారాం గేట్ ప్రాంతాల్లో అధికారులు,సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మొదట మౌలాలిలోని సంజయ్ గాంధీనగర్ మసీదు రోడ్డులో డీసీ,డీఈ,రాంకీ ప్రతినిధులు,ఈపీటీఆర్ఐ, ఎంటమాలజీ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టారు. దోమల లార్వా పెరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, దోమల వ్యాప్తి నివారణకు చేపడుతున్న చర్యలు,ఫాగింగ్, యాంటీ-లార్వల్ ఆపరేషన్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లార్వా పెరుగుదలను నివారించేందుకు ముందస్తు చర్యలను మరింత ముమ్మరం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆర్‌పీఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో ఉన్న నీటి బావిని కమిషనర్ పరిశీలించారు ప్రస్తుతం వినియోగంలో లేని ఈ బావిలో నిల్వ నీరు ఉండటంతో దోమల లార్వా పెరిగే ప్రమాదం ఉందని చెప్పారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అలాగే భవిష్యత్తులో ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆ వారసత్వ బావిని శుభ్రపరిచి, పునరుద్ధరించి, సమర్థవంతంగా నిర్వహించే మార్గాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మల్కాజిగిరి లోని మహేంద్రహిల్స్, ఇందిరా నెహ్రూనగర్ ప్రాంతంలో కొండ ప్రాంతాల్లో ఇళ్లు ఉండటంతో సాట్ ఆటో వాహనాలు ప్రతి ఇంటికి చేరుకుని చెత్త సేకరణ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషనర్ గుర్తించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక ప్రజలతో మాట్లాడి సూచనలు స్వీకరించారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రతి ఇంటి వద్ద నుంచి చెత్త సేకరణ తప్పనిసరిగా జరిగేలా సాట్ ఆటో డ్రైవర్లు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించి, రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అంతే కాకుండా మౌలాలిలోని ఆనంద్‌బాగ్ మెయిన్ రోడ్, ఏఎన్ఆర్ నగర్ కాలనీలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లతో మాట్లాడి ఎన్యుమరేషన్ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ డ్యూటీలు సమయానికి ప్రారంభమవుతున్నాయా అనే విషయాన్ని కూడా పరిశీలించారు.జనగణన ప్రక్రియ సమర్థవంతంగా కొనసాగేందుకు సిబ్బంది హాజరు,సమయపాలన, పనితీరుపై సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు.చివరగా సికింద్రాబాద్‌లోని తుకారాంగేట్,న్యూ వెంకటేశ్వర నగర్ ప్రాంతాన్ని సందర్శించారు. సాట్ ఆటో డ్రైవర్లతో మాట్లాడిన కమిషనర్, ప్రాంతంలో జరుగుతున్న రోజువారీ చెత్త సేకరణ విధానాన్ని సమీక్షించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సాట్ ఆటో వాహనాలకు క్రమం తప్పకుండా అందిస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి చెత్త సేకరణ సేవలను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.రోడ్లు,బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు ఒక్క కలెక్షన్ పాయింట్ కూడా మిస్ కాకుండా చెత్త సేకరణ నిర్వహించాలని అధికారులు,సాట్ ఆటో డ్రైవర్లను కమిషనర్ ఆదేశించారు. ప్రాంతంలో మెరుగైన పారిశుధ్యం, పరిశుభ్రతను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# టిడ్కో లబ్ధిదారులందరికి రిఫండ్ చేస్తాం

తిరుపతి : నగరంలో 2018-19 సంవత్సరంలో ఏపీ టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు రిఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో ఏపీ టిడ్కో డబుల్ బెడ్ రూమ్ హౌసింగ్ కోసం 2472 మంది లబ్ధిదారుల నుండి దాదాపు 5 కోట్ల రూపాయలను లబ్ధిదారుల వాటా కింద కట్టించుకోవడం జరిగిందని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఏపీ టిట్కో ప్రాజెక్టును రద్దు చేసి లబ్ధిదారులకు వారు కట్టిన రిఫండ్ నగదును తిరిగి ఇవ్వలేదని ఆయన తెలిపారు. లబ్దిదారులకు రిఫండ్ చెల్లించాలని గత అసెంబ్లీ సమావేశాల్లో తాను మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లబ్దిదారుల ఇబ్బంది చూసి రిఫండ్ కు అంగీకరించారని ఆయన తెలిపారు. లబ్దిదారులకు రిఫండ్ ఇవ్వడంతోపాటు సెంటు భూమి కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కేటాయించిందని ఆయన చెప్పారు. ఇంచార్జి కమిషనర్ శారద దేవి మాట్లాడుతూ 2472 మంది లబ్దిదారులకు గాను డబుల్ పేమేంట్స్ పోను 1890 మంది తేలారని చెప్పారు. వీరిలో ఇరవై మంది ఆధార్ కార్డులు సరిపోలేదని ఆమె తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారుల డాక్యుమెంట్ వెరిఫికేషన్ జరుగుతున్నదని ఆమె తెలిపారు. డాక్యుమెంటేషన్ పూర్తయిన వెంటనే మూడు ఫేజ్ లలోని లబ్దిదారులందరికి ఆన్ లైన్ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో రిఫండ్ మొత్తాన్ని జమ చేస్తామని ఆమె చెప్పారు. ఏపీ గ్రీనరీ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏపీ టిడ్కో ప్రాజెక్టు ప్రారంభించామని, అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వం దానిని రద్దు చేసిందని దీనితో ప్రస్తుతం వారికి అమౌంట్ రిఫండ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మాజీ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సూపరింటెండెంట్ రాజశేఖర్, మునిరత్నం రెడ్డి, హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, శ్రావణి, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన బ్రిడ్జ్ పనులు పూర్తి..

రేణిగుంట : తిరుపతి జిల్లా రేణిగుంట మండల కేంద్రంలో గత నెల రోజులుగా సాగుతున్న వాహనదారుల కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. రైల్వే అండర్ బ్రిడ్జ్ మరమ్మతుల కారణంగా మూసివేయడంతో, రేణిగుంట పట్టణంలోకి రావాలంటే వాహనదారులు పాత రోడ్డు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాల్సి వచ్చేది. అయితే ఆ మార్గాల్లో రోడ్లన్నీ గుంతలమయమై, ప్రయాణం నరకప్రాయంగా మారిందని అటు స్థానికులు, ఇటు తిరుమలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ట్రాఫిక్ కష్టాలపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు పూర్తయి, తాజాగా అండర్ బ్రిడ్జ్ పునఃప్రారంభమైంది. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కృషితోనే ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తయ్యాయని టీడీపీ నాయకులు కొనియాడారు. ప్రజలు, భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. సుధీర్ రెడ్డి చొరవ వల్లే నెల రోజులుగా పడుతున్న కష్టాల నుండి వాహనదారులకు విముక్తి లభించిందని వారు తెలిపారు.?ఈ సందర్భంగా రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజా సౌకర్యాలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాము అధికారులతో, కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూశామన్నారు. అనంతరం, ప్రజా సమస్యను గుర్తించి సానుకూలంగా స్పందించి పనులు పూర్తి చేసిన అధికారులను మహబూబ్ బాషా మరియు ఇతర నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర, సిఐ జయచంద్ర, రేణిగుంట మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం

## - సోనియా గాంధీ , సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం.



ఖమ్మం మే 16( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోని శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీ.వో ఆర్డి నంబర్ 679 ను జారీ చేసినందుకు, ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ కి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న ఉద్యమకారుల చిరకాల కోరిక నెరవేరుతున్న సందర్భంగా ఉద్యమకారులంతా చాలా ఆనందంతో ఉన్నారు గాని, కమిటీ యొక్క విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని కాలయాపన చేయకుండా శ్రీకృష్ణ కమిటీ లాగా ఊరూ,ఊరూ వాడ,వాడ తిరిగి ఉద్యమకారులను, నాయకులను నేరుగా కలిసి గుర్తింపు కార్డులను జారీ చేసి తుది నివేదికను తయారుచేసి తక్కువ టైంలో ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , గుంతేటి వీరభద్రం,పగడాల నరేందర్,బచ్చల పద్మాచారి,షేక్ అబ్బాస్,బత్తిన మధుగౌడ్, లింగనబోయిన సతీష్,కూరపాటి సుశీల , రవిచంద్ర చౌహాన్, బాలిన భాస్కర్ రెడ్డి,దరిపల్లి వీరబాబు,మోత్కురి వేంకటేశ్వరా చారి,భుక్య శ్రీనివాస్ నాయక్,దొడ్డ శ్రీనివాస్ రెడ్డి,కోడిరెక్క ఉమాశంకర్,గాజుల రవి కుమార్,ఆసిఫ్,బురాన్,కోటేశ్ యాదవ్,రెడ్డబోయిన వరలక్ష్మి ,గ్లోరి,కమలమ్మ ధనలక్ష్మి ,స్వరూప,కోసూరి వీరబాబు ,పగడాల నాగరాజు, పగడాల శీను ,గాలి రాము, ఇనుప శీను ,లంజేపల్లి బాబు ,నార్పొంగు వెంకట్ ,పరికపెల్లి ఎల్లయ్య ,ఎస్ కే యాకూబ్, సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిని 'గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా తీర్చిదిద్దుతాం

తిరుపతి : ఆధ్యాత్మిక నగరం తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఐకానిక్ గ్లోబల్ టూరిస్ట్ హబ్'గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జిల్లా పర్యాటక శాఖ అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి పరిసర ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన మంత్రి దుర్గేష్ పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను త్వరితగతిన పట్టాలెక్కించాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు ఇన్వెస్టర్లకు అవసరమైన భూములను కేటాయించడం, ఇప్పటికే కుదుర్చుకున్న ఎంవోయూల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ వివరాలు, ఎగ్జిస్టింగ్ ప్రాపర్టీస్ మరియు కోర్టు కేసుల స్థితిగతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి: కలెక్టర్ హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం మే 16.

మిల్లులలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలోని షణ్ముఖ ఇండస్ట్రీస్, గౌరీ శంకర్ ఆగ్రో ఇండస్ట్రీస్, పవనసుత ఇండస్ట్రీస్‌లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, ప్రతి మిల్లుకు కేటాయించిన లక్ష్యం మేరకు ధాన్యం దిగుమతి జరగాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా వేగంగా తరలింపు జరుగుతోందని, ఈ విషయంలో మిల్లర్ యజమానులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. దిగుమతిలో జాప్యం లేకుండా ఎక్కువమంది హమాలీలను అందుబాటులో ఉంచి షిఫ్ట్‌ల వారీగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో స్థానికంగా పని చేసే హమాలీలను కొనుగోలు కేంద్రాల వద్దనే వినియోగిస్తే మిల్లుల్లో ఆలస్యం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ బాధ్యతను స్థానిక తహసీల్దార్ పర్యవేక్షించాలని సూచించారు.
ధాన్యం దిగుమతి పూర్తైన వెంటనే మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్‌లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దిగుమతిలో జాప్యం కాకుండా రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సదానందం, తహసీల్దార్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ ఘటనలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### రాయపోల్ ఎస్ఐ మానస.

సిద్దిపేట ప్రజాకలం మే 16.

ఇటీవల జిల్లాలో చైన్ స్నాచింగ్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని రాయపోల్ ఎస్ఐ మానస అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరించి బయటకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రాత్రి సమయంలో ఇళ్ల ముందు లేదా ఆరుబయట పడుకునే వారు బంగారు ఆభరణాలు ధరించి ఉ ఒడకూడదన్నారు. ఒంటరిగా ప్రయాణించే సమయంలో అపరి చిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరిం చాలని, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే గ్రామ పెద్దలకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో అపరిచితులు సంచరిస్తే వారి వివరాలు తెలుసుకోవాలని, అవసరమైతే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహిస్తున్నారని, ప్రజలు కూడా సహకరించి నేరాల నివారణలో భాగస్వాములు కావాలని ఎస్ఐ మానస తెలిపారు. మీ భద్రత మీ చేతుల్లోనే ఉ ంది. చిన్నచిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను నివారిస్తాయి. అందరూ అప్రమత్తంగా ఉండి తమ కుటుంబ సభ్యులను కూడా జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాలి అని ఎస్ఐ మానస పేర్కొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదు

### మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందూరి యుగంధర్ గౌడ్



మహేశ్వరం, మే 16,(ప్రజా కలం)

నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందూరి యుగంధర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంపు నిర్ణయంపై ఆందోళన తెలియజేస్తూ ఈ నిర్ణయం అనేక రంగాల పై వ్యతిరేక ప్రభావం చూపుతుంది. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని అన్నారు.మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప... ఫలితాలు తెచ్చిన పాలసీ కాదు అన్నది తేలిపోయింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలింది. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోంది. ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరింది.
ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే.

ప్రపంచంలో భారత్ ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుంది!? ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం "పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం" అని పదే పదే ప్రకటించింది. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారు. ఇది విశ్వాస ఘాతుకం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ ఆయన డిమాండ్ చేశారు.

## కార్మిక కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్..

### గుండెపోటుతో మరణించిన కార్మికుడి కుటుంబానికి 5 లక్షల 50 వేల రూపాయల నష్టపరిహారం అందజేత..



పటాన్ చేరు మే 16 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు కార్మిక రంగానికి పెద్దపీటవేస్తూ వారి సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరో సారి కార్మిక రంగం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. గుండెపోటుతో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించి వారి కుటుంబానికి అండగా నిలిచారు వివరాల్లోకి వెళ్తే..ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల స్మార్కో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాంటాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి (35) మూడు రోజుల క్రితం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. అత్యంత నిరుపేద కుటుంబం నేపథ్యం కలిగిన కృష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం 5 లక్షల రూపాయలు నష్టపరిహారంతో పాటు 50 వేల రూపాయలు అంత్యక్రియల ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు
ఈ మేరకు శనివారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం డబ్బులను అందచేశారు
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నేపధ్యం నుండి రాజకీయాల్లోకి వచ్చిన తనకు కార్మికుల కష్టనష్టాలు తెలుసునని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కార్మిక రంగానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా పటాన్చెరు అధ్యక్షులు సుధీర్ రెడ్డి, పాశమైలారం వైస్ చైర్మన్ రాఘవరెడ్డి, ప్రతినిధులు ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, రమణారెడ్డి. లక్ష్మణరావు, సురేష్. రంజిత్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, చంద్రశేఖర్, మధు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో వ్యక్తి అదృశ్యం

మహేశ్వరం, మే 16, (ప్రజా కలం)

మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన చోటుచేసుకుంది. మహేశ్వరం గ్రామానికి చెందిన ఎప్పలపల్లి రవీందర్‌రెడ్డి(53) ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం రవీందర్‌రెడ్డి గత కొంతకాలంగా మనస్థాపానికి గురై ఉన్నారు. 10వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. అనంతరం ఆయన మొబైల్‌ఫోన్ ఇంట్లోనే మరిచిపోయి వెళ్లినట్లు గుర్తించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుమారుడు ఎప్పలపల్లి ఉదయ్‌రెడ్డి(26) గురువారం మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రవీందర్‌రెడ్డి ఎత్తు 5.6 అడుగులు, తెల్లని వర్ణం కలిగి ఉంటారని, తెలుగు మాట్లాడగలరని పోలీసులు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు వెంటనే మహేశ్వరం పోలీసులను సంప్రదించాలని కోరారు.



## కేంద్ర ప్రభుత్వం డీజిల్ పెట్రోల్ పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి

### బాలాపూర్ మండల ఎమ్మార్వో ఆఫీస్ ముందు నిరసన తెలిపిన బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, మే 16, (ప్రజా కలం)

కేంద్ర ప్రభుత్వం డీజిల్ పెట్రోల్ పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోకుండా మతాన్ని కులాన్ని అడ్డుపెట్టుకొని ఏదో ప్రజలు నిత్యం వాడే పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై ధరలు పెంచి ఆదాని బడాబడా కార్పొరేట్ సంస్థలకు డబ్బు దోచుపెట్టి సామాన్యుడు ఉప్పు అగ్గిపెట్టె




కొనాలన్న అందుబాటులో లేని విధంగా కేంద్ర ప్రభుత్వం ధరలను పెంచి బడా బాబులకు వారి అనుకూలమైన వారికి దూచిపెడుతుంది రాబోయే రోజుల్లో మధ్యతరగతి వాడు రోజుకు ఒక పూట భోజనం చేయలేని పరిస్థితిని మోడీ ప్రభుత్వం పేదవాడికి కల్పిస్తుంది మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి పేదవానికి అందుబాటులో ఉండే విధముగా ధరలను తగ్గించొద్దని మేము గద్దనెక్కినము కులాలతో మతాలతో ప్రజలను విడదీసి పాలిస్తామన్న వారి ఆలోచనను సిపిఐ పార్టీ ఖండిస్తూ రాబోయే రోజుల్లో మోడీ ప్రభుత్వం చేసే ప్రజావ్యతిరేక పాలనకు బుద్ధి చెప్పి ప్రజలకు అండగా ఉంటామని పేద ప్రజలకు కష్టం వచ్చినప్పుడు సిపిఐ పార్టీ ముందుంటుందని ప్రజలు ఇప్పుడు గ్రహించారని వారికి తోడుగా ఎల్లప్పుడూ మేము ముందుండి పోరాడుతామని అన్నారు.

## గజ్వేల్ కీర్తిని దేశవ్యాప్తంగా చాటనున్న పిడిచేడ్ బాలుడు వర్షిత్

గజ్వేల్ :16 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం పిడిచేడ్ గ్రామానికి చెందిన పంగ రామస్వామి కుమారుడు వర్షిత్ (13) ఇటీవల నిర్వహించిన జూడో క్రీడల సెలక్షన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి శిక్షణ సంస్థకు ఎంపికయ్యాడు.జూడో విభాగంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ఏఐ) ఆధ్వర్యంలోని లుధియానా ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా మారింది.ఈ శిక్షణ కేంద్రంలో దేశానికి ప్రాతినిధ్యం వహించే ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దుతారు. చిన్న వయసులోనే ఈ స్థాయి అవకాశం దక్కించుకున్న వర్షిత్‌పై గ్రామస్థులు ప్రశంసలు కురిపించారు. వర్షిత్‌కు,అతని తండ్రి రామస్వామికి గ్రామ పెద్దలు, యువత,క్రీడాభిమానులు అభినందనలు తెలియజేశారు. జూడో క్రీడలో మరింత రాణించి గజ్వేల్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని,దేశం గర్వించే స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.



# సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా జిల్లా అధికారులు పని చేయాలి

### చేవెళ్ల పార్లమెంటు సభ్యులు, దిశ చైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, మే 16,(ప్రజా కలం)

దిశ అంటే ఒక మార్గం, అభివృద్ధి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు, దిశ ఛైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు.శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, బ్యాంకర్లు, పంచాయితీ రాజ్, శిశు సంక్షేమం, పౌర సరఫరాలు, పరిశ్రమలు, పశు సంవర్ధక శాఖ, మత్సశాఖ, ఉద్యానవన, మిషన్ భగీరథ, రూరల్ వాటర్ సప్లై, జాతీయ రహదారులు, గృహ నిర్మాణ శాఖ, మార్కెటింగ్, అటవీ, ఇరిగేషన్, ఆర్అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులతో చేపట్టిన పనులు, పథకాలు అమలుపై జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు,వాటి ప్రయోజనాలు, ఎంత సబ్సిడీ అందుతుందనేది ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు తెలుసుకోవాలని, ప్రభుత్వ పథకాలపై గ్రామాలు, మండల, పట్టణ కేంద్రాల్లో సభల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీలలో టీచర్లు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, అంగన్వాడీ పిల్లలకు పాఠశాలల్లో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని, గుడ్డుతో పాటు పాలు అందించాలని, జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారికి ఎంపీ సూచించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ లు జరగకుండా చూడాలని మైనింగ్ అధికారికి సూచించారు. జిల్లాలోని మత్స్యకారులకు చేపలు పట్టే విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇప్పించి కావాల్సిన వలలను కూడా అందజేయాలని, తద్వారా స్థానిక మత్స్యకారులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని ఎంపీ సంబంధిత శాఖ అధికారికి సూచించారు. జిల్లాలో ఇదివరకే నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని డబుల్ ఇండ్లకు సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. బ్యాంకు రుణాల విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, జిల్లాలో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా అన్ని రంగాలకు విరివిగా రుణాలను అందించాలని ఎంపీ బ్యాంకర్లను ఆదేశించారు. ముద్ర, విశ్వకర్మ పథకాలతో పాటు చిరు వ్యాపారస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే రుణాలు అందేలా చొరవ తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉ న్న ప్రధాన, ఇతర రహదారులను పూర్తి చేయాలని, చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఎంపీ సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. జిల్లాలో పాడి ఉత్పత్తి అధికంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారికి సూచించారు. జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని దిశా కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తేగా, ఆయన స్పందిస్తూ గోపాలమిత్ర పథకంలో భాగంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి పశువులకు సత్వరమే వైద్య సేవలు, సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.దిశ సమావేశంలో పాల్గొన్న షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకరయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తెచ్చారు.దిశ సమావేశంలో షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకరయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కొమ్మిశెట్టి కిరణ్మయి, డీఆర్డీఓ శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, మున్సిపల్ కమిషనర్లు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# జూన్ 15 నుంచి జులై 24 వరకు....

## -ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి





### -రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

సంగారెడ్డి ప్రతినిధి, మే 16 ( ప్రజాకలం):

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా జూన్ 15 నుంచి 24వ తేదీ వరకు సంబంధిత సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ తదితర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూర్తి చేసిన ఫారాలను తిరిగి స్వీకరిస్తారని చెప్పారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 లోగా వాటిని పరిష్కరించి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగ ఓటర్ల నమోదుపై బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరైన అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది

### -- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

### -టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి మే 16 (ప్రజా కలం):

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జరిగిన విద్యా వారోత్సవాలకు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల లో ఆన్లైన్ తరగతుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మానిటర్ లను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. భవిష్యత్తు పై స్పష్టమైన దృష్టి తో ఇప్పటినుండే కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, ప్రిన్సిపాల్ సునీత, లెక్చరర్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక సాగరమైన చిట్కుల్

## వైభవంగా శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీనివాస కళ్యాణం..

### లోక కళ్యాణార్థం నీలం కవిత మధు దంపతుల సంకల్పం..

### అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా సాగిన వేడుక...

### భారీగా తరలివచ్చిన భక్తజనం, పాల్గొన్న ప్రముఖులు..

### గోవింద నామస్మరణతో మారుమోగిన పరిసరాలు..





పటాన్ చేరు మే 16 (ప్రజా కలం) ప్రతినిధి

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా, భక్తుల జయజయధ్వానాల మధ్య ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ లోని ఎన్ ఎం ఆర్ క్యాంపు కార్యాలయం ఒక మినీ తిరుపతిని తలపించింది. శుక్రవారం మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ - కవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఫసల్వాది జ్యోతిర్వస్తు పీఠం మహేశ్వర సిద్ధాంతి శర్మ, భూపతి స్వామి గార్ల ఆశీస్సులతో సిరిసిల్ల బీటుకూరి నవీన్ ఆచార్య గారి పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా, అత్యంత వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థం, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలనే సత్సంకల్పంతో నిర్వహించిన ఈ వేడుకకు భక్తజనం పోటెత్తింది.

కళ్యాణ మహోత్సవం కోసం చిట్కుల్ లోని ఎన్ ఎం ఆర్ క్యాంప్ కార్యాలయం ఆవరణలో సర్వాంగ సుందరంగా భారీ వేదికను తీర్చిదిద్దారు. సిరిసిల్ల నుండి విచ్చేసిన పండిత బృందం ఈ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుండే మంగళ వాయిద్యాలు, వేద పఠనాలతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీనివాసుడు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, విశేష ఆభరణాలతో అలంకరించి వేదికపైకి తీసుకురావడంతో భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది.

నీలం కవిత నీలం మధు దంపతులు సంప్రదాయబద్ధంగా పీఠంపై కూర్చుని కళ్యాణ క్రతువులో పాల్గొన్నారు. విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన ఈ వేడుకలో పుణ్యాహవాచనం, విష్వక్సేన ఆరాధన, అంకురార్పణ వంటి ఘట్టాలను అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు కంకణధారణ గావించి, ప్రవరను చదివి వినిపించారు. జీలకర్ర బెల్లం ఉంచే సమయానికి భక్తుల హర్షధ్వానాల మధ్య ఆధ్యాత్మిక ఉద్వేగం నెలకొంది. లోక రక్షకుడైన శ్రీనివాసుడు అమ్మవార్ల మెడలో మాంగల్యధారణ గావించిన ఘట్టం భక్తుల కళ్లకు కట్టినట్లుగా సాగింది. నీలం కవిత మధు దంపతులు స్వామివారికి ముత్యాల తలంబ్రాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ శ్రీవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఈ కళ్యాణాన్ని నిర్వహించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న మాకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఎంతో మానసిక తృప్తిని ఇచ్చిందని వివరించారు. ఎన్నికలలో గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల చెంత ఉండి సేవలందిస్తామని వారు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ వేడుకను వీక్షించేందుకు చిట్కుల్‌తో పాటు పటాన్‌చెరు ఇస్నాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి తో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

అంతకుముందు నీలం కవిత మధు దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారి నివాసంలో ప్రత్యేక పూజలు, యజ్ఞాధి కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమాలకు టీజీఐఐసీ చైర్మన్, డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, పటాన్చెరు ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, మెదక్ డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్, మహిళా కమిషన్ మెంబెర్ శశికళ యాదవ రెడ్డి, సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పటాన్చెరు ఏఎంసీ చైర్మన్ శివానందం, ఇస్నాపూర్ మున్సిపాలిటీ కమీషనర్, కౌన్సిలర్లు, పటాన్చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, ఐ న్ టి యూ సి జిల్లా ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, గార్లు విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు

కళ్యాణం అనంతరం విచ్చేసిన భక్తజనానికి అన్నదాన కార్యక్రమం నిర్వహించి, స్వామివారి లడ్డుప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, కాంగ్రెస్ మండల,బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.



## ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కౌడ నరేష్ యాదవ్ ఎన్నిక.

సిద్దిపేట ప్రజాకలం మే 16.

దౌల్తాబాద్--గజ్వేల్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని మల్లేశంపల్లి గ్రామానికి చెందిన కౌడ నరేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఆటో యూనియన్ సభ్యులు సమావేశమై ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కౌడ నరేష్ యాదవ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏ ఆపద వచ్చినా తాను ముందుండి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చ స్టేట్ సెక్రటరీగా పి.రామన్ సింగ్..

సికింద్రాబాద్: మే 16: ప్రజా కలం ప్రతినిధి

భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చ స్టేట్ సెక్రటరీగా పి.రామన్ సింగ్ నియమితులయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆదేశాల మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆఫీస్ బేరర్స్, కార్యనిర్వహక సభ్యులను ప్రకటించారు. అయితే బిజెపి మోర్చ సీనియర్ నాయకులు రామన్ సింగ్ ను ఆఫీస్ స్టేట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా రామన్ సింగ్ మాట్లాడుతూ... తన మీద నమ్మకంతో ఈ బాధ్యతలు



అప్పగించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ , బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తూ, ప్రధాని మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా రామన్ సింగ్ కు కుటుంబ సభ్యులు, మిత్రులు, పార్టీ కార్యకర్తలు, శుభాకాంక్షలు తెలిపారు.

# వెంచర్ కారణంగా నిలిచిపోతున్న వర్షపునీరు

- చినుకు పడితే చాలు చెరువుల మారుతున్న తుమ్మలూరు రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- వర్షపు నీరు వెళ్లే విధంగా వెంచర్ యజమాన్యం చర్యలు తీసుకోవాలి
- వర్షపు నీరు పోయే కుంటలో వెంచర్ నిర్మాణం చేస్తే ఇలాగే ఉంటుంది
- భవిష్యత్తులో భారీ వర్షాలు పడితే వెంచర్ లో నిర్మించిన ఇండ్ల పరిస్థితి ఏంటి...?
- అక్కడ పొట్టి కుంట పెట్టుకొని వెంచర్ కి అనుమతులు ఎలా ఇచ్చారు
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్



మహేశ్వరం, మే 16,(ప్రజా కలం).

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో చిన్న పాటి వర్షం పడితేనే రోడ్డు చెరువు లాగా మారాయి దీనికి ప్రధాన కారణం భారీగా వర్షం పడినప్పుడు పక్కనే ఉన్న పొట్టి కుంట లోకి వర్షపు నీరు వెళ్ళేది కానీ ఇప్పుడు అక్కడ వెంచర్ చేయడం వల్ల వర్షపు నీరు వెళ్లకుండా రోడ్డుపైన చెరువు లాగా మారింది. వెంచర్ యజమాన్యం వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు పడితే రోడ్డుతో పాటు వెంచర్ లో నిర్మించిన ఇండ్లు పూర్తిగా మునిగిపోతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వెంచర్ నిర్మాణం ఎలా అనుమతులు ఇచ్చారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే వర్షపు నీరు పోయే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మహేశ్వరం మండల కేంద్రంలోని నుండి తుమ్మలూరు గ్రామానికి వెళ్లాలంటే వర్షం పడితే చాలు మహేశ్వరంలో



పొట్టి కుంటలో వెచ్చేర్ చేసి ప్లాట్లు చేయడంతో అందులో ఉన్నటువంటి కాల్వ ద్వారా వచ్చే నీళ్లు ఎటు పోలేక అక్కడ ఉన్న కల్వర్టు క్లోజ్ చేయడంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచి చెరువుల తలపిస్తుంది తుమ్మలూరు గ్రామానికి వాహనదారులు రాకపోకల కొనసాగించాలంటే ఇబ్బందిగా మారింది ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు గాని వెంచర్ లో ఉన్న కాలువను క్లియర్ చేయాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఈ నీరు నిలవడంతో మహేశ్వరంలో ఉన్నటువంటి రెండవ వార్డు చెరువుల తలపిస్తుంది అధికారులు తక్షణమే చర్య తీసుకుని ఈ సమస్య ను పరిస్కారం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.






## జీడీసిలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 16 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న విద్యా వారోత్సవాల్లో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దు కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత బయటికి రావడంతో పాటు పోటీ భావన అలవడుతుంద న్నారు. అలాగే ఏఐ టూల్స్ పై టిఎస్కేసి మెంటర్ రాజు కళాశాలలో విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వల్ల కలిగే లాభాలతో పాటు నష్టాలను సైతం క్లుప్తంగా విద్యార్థులకు వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం చంద్రకాంత్, డాక్టర్ వి శంకరయ్య, అధ్యాపకులు శివకుమార్, నాగానిక, అరుణ్ కుమార్, సిద్దు రాజు, కృష్ణ ప్రసాద్, గోదావరి, రాణి, చంద్రకాంత్, శశిధర్, సంతోష్, దశరథ్, కిరణ్ కుమార్, వసంతలక్ష్మి, హరికృష్ణ, వరుణ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ లేబర్ కార్డులున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### - బి ఎన్ ఆర్ కే ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మర్లు సాయిబాబా



కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 16 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా బాన్సువాడ సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయ పరిధిలో మధ్యవర్తుల ద్వారా నకిలీ లేబర్ కార్డులు జోరుగా వెలువడుతున్నాయని, ఇందుకు కారకులైన వారిని గుర్తించి వారిపై, కార్డులు పొందిన వారిపై కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మర్లు సాయిబాబా డిమాండ్ చేశారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామ భవన నిర్మాణ రంగాల కార్మికుల కు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సాయిబాబా మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు నిజమైన పని చేసే 14 రంగాల భవన నిర్మాణ కార్మికులు మాత్రమే లబ్ధి పొందేలా చూడాలన్నారు. గ్రామంలో పనిచేసే ప్రతీ కార్మికుడికి లేబర్ కార్డు ఉండాలని సూచించారు. అనంతరం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు బీడీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశం లో కార్మిక సంఘం నాయకులు మాట్లాడారు. నకిలీ లేబర్ కార్డులు పొందే వారి వల్ల నిజమైన పని చేసే భవన నిర్మాణ రంగ కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ అధికారులు సర్వే చేసి కేవలం పనిచేసే కార్మికులకు మాత్రమే కార్డులు జారీ చేయాలన్నారు. అలా కాకుండా నకిలీ కార్మికుడు లబ్ధి పొందితే అతనిపై చట్టపరంగా



చర్యలు తీసుకోవడంతో పాటు లేబర్ కార్డు రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఎల్లారెడ్డి మండల ఉపాధ్యక్షులు పెద్దబాలి సాయిలు, కోశాధికారి దుర్గాసింగ్, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కాంతారావు, కార్యదర్శి గణేష్, ప్రచార కార్యదర్శులు కరీం, చందు, సీనియర్ నాయకులు బాబు, శివాజీ, బాబు, సత్యనారాయణ, రాజు, తిరుపతి, మల్లికార్జున, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్

### 169 కేసులు, ఏడుగురికి జైలు శిక్ష, 10.80,000/- జరిమానా!




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 16:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 1 వారంలో డ్రంకన్ డ్రైవ్ లో 169 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు, బోధన్ మరియు అర్మూర్ కోర్టులలో వారిని హాజరు పర్చగా ఇందులో 07 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ 10,80,000/-జరిమానా విధించనైనది. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పోలీస్ వారికి పట్టుబడటం జరుగుచున్నది, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగముగా తేది:11-5-2026 నుండి తేది: 16-5-2026 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 169 కేసుల నమోదు చేయడం జరిగింది.

నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్, కింది గమనికలు తెలియజేయడం జరిగింది.

1) ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు

2) వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరు.

3) డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడును

4) మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదు.

5) మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ మరియు వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదు.

6) ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడును

7) మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడును. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడును.

## కోతుల బారి నుండి ఇళ్లను కాపాడుకునేందుకు

## "రూఫింగ్ రేకుల వైపు ప్రజల చూపు"

### - కూన పెంకులను తీసేసి రూఫింగ్ రేకులను వేసుకుంటున్నవైనం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 16 ప్రజా కలం : ప్రస్తుతం గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎటు చూసినా పెంకుటిల్లు కోతుల



స్వైర విహారంతో విధ్వంసకరంగా మారుతున్నాయి. దీంతో వర్షాకాలంలో ఇల్లు ఉరిసి కూలిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రజలు కోతుల బారి నుండి తమ ఇళ్ళను



కాపాడుకునేందుకు కూన పెంకుల పై నుండి ఆధునిక టెక్నాలజీతో తయారైన రూఫింగ్ రేకులను వేసుకుంటున్నారు. త్వరలోనే వర్షాకాలం రానుండడంతో కోతుల బారిన పడ్డ ఇళ్లను కాపాడుకునేందుకు ముందస్తు చర్యగా ప్రజలు రూఫింగ్ రేకులను వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గ్రామాలు, పట్టణాల్లో కూన పెంకుల ఇళ్లపై ఎర్రటి రూఫింగ్ రేకులు దర్శనమిస్తున్నాయి. వీటిపై కోతులు ఆగే ఆస్కారం ఉండకపోవడంతో పాటు ఎంత భారీ వర్షాలు కురిసిన ఇల్లుకు ఎలాంటి నష్టం వాటిల్లకపోవడం విశేషం. ప్రస్తుతం రూఫింగ్ రేకులకు మంచి గిరాకీ ఉండడంతో ఆ తయారీ యూనిట్లతో పాటు వాటిని విక్రయించే దుకాణాలు సైతం విరివిగా వెలుస్తున్నాయి.



## ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ఆసుపత్రిలో దోమల నివారణ అవగాహన కార్యక్రమం

ముషీరాబాద్, మే 16 (ప్రజా కలం ప్రతినిధి)

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ (UPHC) ఆసుపత్రిలో దోమల నివారణ మరియు పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు చేతులు పైకెత్తి దోమల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. "ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దాం", "దోమల నివారణకు అందరం కలిసి పనిచేద్దాం" వంటి నినాదాలతో కార్యక్రమం కొనసాగింది. అధికారులు మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే దోమల వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పారిశుధ్య నియమాలను పాటించాలని కోరారు.




## కూలీలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన మెండోరా ఎస్సై సుహాసిని




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)మే 16:

మెండోరా మండలంలోని కోడిచెర్ల గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు మెండోరా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) జాదవ్ సుహాసిని పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. శనివారం కూలీలు పని చేసే ప్రాంతానికి వెళ్లిన ఆమె, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు, ప్రమాదాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సుహాసిని మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల గ్రామీణ ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని, బ్యాంకు వివరాలు, ఓటీపీ నంబర్లను ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. అలాగే, ఆరోగ్యాన్ని నాశనం చేసే కల్తీ కల్లు సేవించడానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత నియమాలపై కూలీలకు అవగాహన కల్పిస్తూ.. బైక్‌పై ప్రయాణించే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని వివరించారు.

ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నందున చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్సై కోరారు. వేసవి వేడి తట్టుకోవడానికి పిల్లలు ఈత కోసం చెరువులు, బావులు, కాలువల వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా చూసుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

## ఇంద్రధనస్సు మకర తోరణం లో శ్రీవారి దర్శనం

మల్కాజ్గిరి మే 16 ప్రజా కలం

మల్కాజ్గిరి లోని ఆనంద్ బాగ్ లో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారు శనివారం సప్తవర్ణాల తోరణాలతో ఏర్పడ్డ ఇంద్రధనస్సులో స్వామివారు భక్తులకు అత్యద్భుతంగా దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుల వారు శ్రీ ముడుంబై వెంకట రమణాచార్యులు మాట్లాడుతూ... వచ్చే వర్షాకాలంలో వర్షాలు సకాలంలో పడి వాడి పంటలతో ప్రజలు సుఖసంతోషా లతో ఉండే విధంగా మేఘాలతో కూడి వర్షాకాలంలో వచ్చే ఇంద్రధనస్సు వలె సప్తవర్ణాలతో చేసినట్టే దూది దారపు తోరణాల మధ్య స్వామివారు మామిడి రామచిలుకలు వజ్రవైఢూ ర్యాలతో ఉన్నటువంటి కిరీటంతో ఆపాద మస్తక దర్శనం భక్తులకు ఇస్తున్నట్లుగా ఈరోజు సాలగ్రామ స్వామి వారు తమిళనాడులో - కడలూరు జిల్లాలో అత్యంత పురాతనమైన - 16 భుజాలతో, ఉగ్రరూపంలో వేంచేసియున్న శ్రీ సింగిరికుడి లక్ష్మీ నరసింహస్వామి స్వామి రూపంలో సాలగ్రామ నారాయణుని దర్శనం భక్తులకు కనువిందు చేస్తున్నారు... స్వామివారి సేవలో వెంకట నాయక సేవకులు ఇతర భక్తులు ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొంటున్నటువంటి వారికి స్వామి వారి పరిపూర్ణ కృప కలగాలని వచ్చిన భక్తులకు సుఖ సంతోషాలు కలగాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఆలయ ప్రధాన అధికారి మాట్లాడుతూ శనివారం స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారని వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకల ఏర్పాట్లు చేశామని మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించామని తెలిపారు..



## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేతల ఆర్థిక సహాయం అందజేత.

సిద్దిపేట ప్రజాకలం మే 16.

దౌల్తాబాద్ మండలం లింగాయపల్లి తండాకు చెందిన లంబాడీ రాములు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పడాల రాములు, సర్పంచ్‌లు నాగరాజు, నర్సింలు, నాయకులు రైతన భాస్కర్, శ్రీను నాయక్, రవి నాయక్, ఇల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్ సెయిలింగ్ అనెక్స్ లో ఉద్యోగుల ఆరోగ్యం కోసం అద్భుతమైన వెల్‌నెస్ కార్యక్రమం

హైదరాబాద్, మే 16 (ప్రజా కలం ప్రతినిధి)

టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ సంస్థ తన ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 21 రోజుల హెల్త్ ఛాలెంజ్ 'క్యాటథాన్ ముగింపు వేడుకలు హైదరాబాద్‌లోని సెయిలింగ్ అనెక్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్... ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలను అభినందించారు.

ఈ కార్యక్రమానికి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపినాథన్(పీహెచ్‌డీ) గౌరవ అతిథిగా విచ్చేశారు. టెంపెస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ తురాబ్ లక్డావాలా కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఈ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ఎంతగానో అభినందించారు. ప్రస్తుత కాలంలో ఆఫీస్ సంస్కృతిలో భాగంగానే ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ముఖ్యమని వారు ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ స్ఫూర్తితో మే 7న ప్రారంభమైన ఈ 'క్యాటథాన్' పోటీలలో టెంపెస్ట్ సంస్థకు చెందిన హైదరాబాద్, ముంబై, బెంగళూరు, పుణే శాఖల ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీ కోసం ఉద్యోగులందరినీ టెంపెస్ట్ వోల్ఫ్స్,



టెంపెస్ట్ పాంథర్స్ మరియు టెంపెస్ట్ జాలీ వాకర్స్ అనే మూడు జట్లుగా విభజించారు. వీరంతా మూడు వారాల పాటు అత్యధిక అడుగులు నడవాలనే లక్ష్యంతో ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఈ ఛాలెంజ్‌లో రేఖా ఓస్వాల్, ప్రసాద్ బి పవార్ మరియు అనంత కుండోజ్వార్ అత్యధిక అడుగులు వేసి మొదటి మూడు స్థానాల్లో నిలిచి వ్యక్తిగత ఛాంపియన్లుగా అవతరించారు. అలాగే జట్ల విభాగంలో 'టెంపెస్ట్ వోల్ఫ్స్' జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో గెలిచిన జట్టుతో పాటు వ్యక్తిగత ఛాంపియన్లు, ఒకే రోజులో అత్యధిక అడుగులు వేసిన వారు, ప్రతి జట్టులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందించి వారి ప్రతిభను గుర్తించారు.

# నేడు బీపీ చెక్

- రేపటి ఆరోగ్యానికి బలమైన అడుగు
- చిన్న జాగ్రత్తలు... పెద్ద ప్రమాదాలకు అడ్డుకట్ట.
- ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్యుల హెచ్చరిక
- "నిశ్శబ్ద హంతకుడు"గా మారుతున్న హైపర్‌టెన్షన్..
- ముందస్తు జాగ్రత్తలే రక్షణ

హైదరాబాద్, మే 16 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య నిపుణులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం జీవనశైలి మార్పులు, ఒత్తిడి, అనారోగ్యకర ఆహారపు అలవాట్ల కారణంగా అధిక రక్తపోటు కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "సైలెంట్ కిల్లర్"గా పేరుగాంచిన ఈ వ్యాధి ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు చూపించకపోవడం వల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని హెచ్చరించారు.

వైద్యుల ప్రకారం ధూమపానం, మద్యం అధికంగా సేవించడం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, మానసిక ఒత్తిడి, కుటుంబ చరిత్ర, మూత్రపిండాల సమస్యలు మరియు థైరాయిడ్ సమస్యలు అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

గుండె, మెదడు, కిడ్నీలపై తీవ్ర ప్రభావం

అధిక రక్తపోటు గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకంగా మారుతోందని వైద్యులు తెలిపారు. రక్తపోటు అదుపులో లేకపోతే మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాగే కిడ్నీలు దెబ్బతినే అవకాశముండటంతో పాటు నేత్ర సంబంధ సమస్యలు కూడా తలెత్తవచ్చని పేర్కొన్నారు.

కనిపించే హెచ్చరిక సంకేతాలు ఇవే

సాధారణంగా చాలామందికి బీపీ ఉన్నా ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే రక్తపోటు ఎక్కువగా పెరిగినప్పుడు కొన్ని హెచ్చరికలు కనిపించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు.

ఉదయాన్నే తలనొప్పి రావడం
తల తిరగడం లేదా చూపు మసకబారడం
ఛాతీలో అసౌకర్యం
శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
అలసట
ముక్కు నుంచి రక్తస్రావం
గుండె తడబాటు
చెవుల్లో మోగుతున్న శబ్దం




చిన్న మార్పులతోనే నియంత్రణ సాధ్యం

ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవడం, ఉప్పు తగ్గించడం, శరీర బరువును నియంత్రించడం, పొగ తాగడం మానేయడం, మద్యం పరిమితం చేయడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం మరియు సరైన నిద్రపోవడం ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యులు సూచించారు.

డయాబెటిస్, అధిక బరువు, కుటుంబంలో బీపీ చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా రెగ్యులర్‌గా బీపీ పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచించారు. జీవనశైలి మార్పుల తర్వాత కూడా రక్తపోటు 130/80 కంటే ఎక్కువగా కొనసాగితే వైద్యుల సలహాతో చికిత్స తీసుకోవాలని తెలిపారు.

ప్రజల్లో అవగాహన పెంపే ప్రధాన లక్ష్యం

ప్రపంచ రక్తపోటు దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో అవగాహన పెంచడం, వ్యాధిని ముందుగానే గుర్తించడం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకునేలా ప్రోత్సహించడం అని వైద్య నిపుణులు పేర్కొన్నారు. "సమయానికి పరీక్షలు -- ఆరోగ్యానికి రక్షణ" అనే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు.

## ఎల్ ఓ సి అందజేసిన మైనంపల్లి

మల్కాజిగిరి,మే 16(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి నియోజకవర్గం మౌలాలి డివిజన్ సాయినాథపురంలో నివాసముంటున్న లలిత అనారోగ్య కారణాల వల్ల నిమ్స్,పంజాగుట్టలో చికిత్స పొందుతుండగా వారికి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసిని శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారి కుటుంబ సభ్యులకు 2లక్షల రూపాయల చెక్కును (ఎల్‌ఓసి) అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మైనంపల్లికి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



ఈ కార్యక్రమాల్లో ఇన్చార్జి లక్ష్మీకాంతరెడ్డి,బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శీను, మహిళ బి బ్లాక్ అధ్యక్షురాలు ఆశ,మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, సంపత్ గౌడ్,ప్రవీణ్ యూసఫ్ ,సీనియర్ నాయకుడు చంద్రకాంత్, పార్థసారథి,శ్రీకాంత్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్,లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# కాలయాపన చేసేందుకే కమిటీ



### టీఆర్ఎస్ నేత మనోజ గౌడ్ ప్రశ్న?
### మహిళలను అవమానించేలా కమిటీ,ఒక్కరికైనా స్థానం లేదా?
### ఉద్యకారుల కమిటీ కాదు,కాంగ్రెస్ కమిటీ అని వ్యాఖ్య
### జూన్ 2 లోపు ఉద్యమకారుల హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్ : మే 16: ప్రజా కలం ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కోసం వేసిన కమిటీ కేవలం కాలయాపన కోసమేనని తెలంగాణ రక్షణ సేన నాయకులు మనోజ గౌడ్ ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక కమిటీ పేరుతో టైమ్ పాస్ చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు.తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆమె మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన అన్ని హామీలను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 లోపు అమలు చేయాల్సిందే నని డిమాండ్ చేశారు.లేదంటే ఉద్యమకారులతో కలిసి తెలంగాణ రక్షణ సేన పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు.ఇచ్చిన హామీలు అమలు చేయటం చేతకాకనే కమిటీ పేరుతో డ్రామాలు చేస్తున్నారన్నారు.

కవిత ఒత్తిడితోనే కమిటీ

ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మొదటి నుంచి పోరాటం చేస్తున్నారని మనోజ గుర్తు చేశారు.పెద్ద ఎత్తున ఉద్యమకారులను కలవటంతో పాటు వారికోసం భూపోరాటలు కూడా చేశారని చెప్పారు. జూన్ 2 లోపు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కవిత ఇచ్చిన అల్టిమేటంతోనే ప్రభుత్వంలో కదలిక వచ్చి కమిటీ వేసిందన్నారు.

ఐతే ఈ కమిటీలో మహిళలకు గానీ కాంగ్రెసేతర ఇతర ఉద్యమకారులకు గానీ స్థానం కల్పించకపోవటం దుర్మార్గమన్నారు.ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహిళలను రేవంత్ అవమానించారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటు చేసింది కాంగ్రెస్ కమిటీయే తప్ప నిజంగా ఉద్యమకారుల గుర్తింపు కోసం వేసిన కమిటీ కాదని విమర్శించారు. ఈ కమిటీ పేరుతో సమయం వృథా చేయకుండా ఉద్యమకారులకు ఇస్తామన్న పెన్షన్లు, గుర్తింపు కార్డులు, స్థలానికి సంబంధించి జూన్ 2 ప్రకటన చేయాలని మనోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ మహిళ నేతలు అనిత చౌదరి, గీతా గౌడ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.









Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com